సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
ఆదివారం, 08.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 108
పేజీలు: 12 వెల: రూ. 5

# క్రికెట్ పండగ

## టీ20 ప్రపంచకప్ సమరం ప్రారంభం

- విశ్వవిజేత వేట షురూ చేసిన టీమిండియా
- వాంఖడేలో మెగా ఫైట్ తో టీ20 ప్రపంచకప్‌కు ఘనంగా అంకురార్పణ
- సూర్య సేన గురి.. డిఫెండింగ్ ఛాంపియన్ హోదా నిలబెట్టుకోవడమే పని!
- హిట్‌మ్యాన్ చేతుల మీదుగా ట్రోఫీ ఆవిష్కరణ బుమ్రా ప్లేసులో సిరాజ్ ఎంట్రీ..

ముంబై/కొలంబో: క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్–2026 శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. శ్రీలంక వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ నెదర్లాండ్స్‌పై అతి కష్టం మీద విజయం సాధించి గండం గట్టెక్కింది. ఇక రెండో మ్యాచ్ లో స్కాంట్లాండ్ ను వెస్టిండీస్ ఓడించింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో గ్రూప్ దశ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, అమెరికాతో తలపడింది..



# గల్లీ ఎన్నికలు.. ఢిల్లీ రాజకీయం

## మున్సిపల్ ఎన్నికల్లో మారిన రాజకీయం స్వరం

- స్థానిక సమస్యలు పక్కన.. కాంగ్రెస్ అజెండాతో ఢిల్లీ స్టైల్ రాజకీయ యుద్ధం
- బహిరంగ సభల్లో రాజకీయ దాడులు.. మున్సిపల్ ప్రచారంలో రేవంత్ రెడ్డి హవా
- కాంగ్రెస్ వేసిన ట్రాప్‌లో విపక్షాలు.. స్థానిక అజెండా మరిచిన బీఆర్ఎస్, బీజేపీ
- కౌన్సిలర్ పనితీరు కాదు.. రాజకీయ బలబలాలే ఓటింగ్ ప్రమాణంగా మారాయా?
- గ్రౌండ్ లెవల్ అజెండా కరువు.. ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మార్చలేని విపక్షాలు
- టికెట్లు రాక తిరుగుబాటు.. మూడు పార్టీలకూ తలనొప్పిగా మారిన రెబెల్స్
- అధికార కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ.. పాత క్యాడర్‌ను మరిచిన ధర్నాలు
- బీఆర్ఎస్, బీజేపీలోనూ అంతర్గత కుమ్ములాటలు..
- 50 ఓట్లే కీలకం.. రెబెల్స్ కింగ్‌మేకర్లా, విలన్లా? ఫిబ్రవరి 11న తేలనున్న ఫలితం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుతున్నారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు అసలు సమస్యను పక్కన పెట్టాయి. ఓటర్ల కనీస అవసరాలైన డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి స్థానిక అంశాల కంటే జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయ విమర్శలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికలంటేనే స్థానిక సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరు. కానీ, ప్రస్తుతం ప్రధాన పార్టీల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం చూస్తుం టే, ఇది కేవలం అధికార, ప్రతిపక్షాల మధ్య పైచేయి సాధించే రాజకీయ కుస్తీగా మారిం దన్న అభిప్రాయం వినిపిస్తోంది.. ముఖ్యంగా అజెండా సెట్ చేయడంలో అధికార కాంగ్రె స్ తనదైన శైలిలో ముందుకెళ్తుంటే, ప్రతిపక్షాలు ఆ ట్రాప్‌లో చిక్కుకున్నట్లు కనిపిస్తోంది.

బహిరంగ సభల్లో రేవంత్ రాజకీయం

సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాల్లో స్థానిక మున్సిపల్ సమస్యల కంటే ఎక్కువగా రాజకీయ అంశాలనే హైలెట్ చేస్తున్నారు. బీజేపీ–బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య బంధం, కాళేశ్వరం అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులను డిఫెన్స్‌లో పడేస్తున్నారు. ప్రతిపక్ష నేతలను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ద్వారా ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా రాజకీయ కోణంలోకి మళ్లించడంలో రేవంత్ మిగతా 02లో




# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ 02

- మరోసారి అధిక ధర పలికిన తొర్రూర్ భూములు
- చదరపు గజం రూ.45 వేలకు కొనుగోలు
- సుమారు రూ. 56 కోట్లు ఆదాయం



# చావుతప్పి గెలిచిన పాక్





రొమారియో హ్యాట్రిక్..

# 11 స్కాట్లాండ్‌పై విండీస్ విజయం !




## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్ని ప్రమాదం

# ఎవిడెన్స్ బూడిద!?

- సెబాస్టియన్.. సంతోష్.. సిట్.. రాజకీయ కేసుల ఎవిడెన్స్ అగ్నికి ఆహుతి!
- ఓటుకు నోటు నుంచి ఫోన్ ట్యాపింగ్ వరకూ కీలక ఫైళ్లు నాశనం
- 14 ఏళ్ల రికార్డులు అగ్నికి ఆహుతి.. కుట్ర కోణమా?
- షార్ట్ సర్క్యూట్ అంటున్న పోలీసులు.. పెరుగుతున్న అనుమానాలు
- హార్డ్ డిస్కులు, డిజిటల్ సాక్ష్యాలు బూడిద
- కీలక రాజకీయ కేసులపై అగ్ని నీడ.. న్యాయ నిపుణుల ఆందోళన
- ఫోరెన్సిక్ అగ్ని ప్రమాదంపై కేటీఆర్ సందేహాలు
- సాక్ష్యాల నాశనమా? ఉన్నత స్థాయి విచారణకు డిమాండ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో జరిగే ప్రతి కేసు ఫైల్ ఇక్కడకు రావాల్సిందే. ప్రధానంగా రాజకీయపరమైన కేసులకు ఇంకా ఇది కచ్చితమైన కేంద్రం. అటు వీడియోలు, ఆడియో రికార్డులపై నిగ్గు తేల్చే ప్రాంతం. అదే తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, రాష్ట్రంలో హీట్ పెంచిన ఆ నాటి సెబాస్టియన్ కేసు నుంచి మొదలుకుని.. నేటి ఫోన్ ట్యాపిం గ్ కేసు వరకు కీలక ఫైళ్లన్నీ ఇక్కడే దాచి పెట్టారు. నాంపల్లిలో గల ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్ర మాదం చోటు చేసుకుంది. ల్యాబ్ బిల్డింగ్ మొదటి అంతస్తులో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ప్రాంతంలో తీవ్ర కలకలం చోటు చేసుకుంది. మంటల ఒక్కసారిగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగలు అలుముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఫోరెన్సిక్ ల్యాబ్ లోని మరీ కీలకమై న ఎవిడెన్స్ దాచి పెట్టిన గది మొత్తం కాలి మిగతా 02లో

# రేవంత్ రెడ్డి వర్సెస్ ఫడ్నవిస్

## తెలంగాణ సీఎం రేవంత్ వ్యాఖ్యలతో రగిలిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్

- మైనారిటీ రిజర్వేషన్లపై సవాల్.. బీజేపీపై ఘాటు విమర్శలు
- విద్వేష ప్రసంగాల చట్టంపై ప్రకటనలకు ఫడ్నవిస్ కౌంటర్
- 'కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలే దేశ విభజనకు కారణం' 09



# దమ్ము లేకపోతే రాజీనామా చెయ్

## సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్



- కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా ఎవరు అడ్డుకుంటున్నారో సీఎం చెప్పాలి
- రేవంత్ రెడ్డే కేసీఆర్‌ను కాపాడుతున్నడు 03
- గతంలో అసదుద్దీన్ బుల్లెట్‌పై కేసీఆర్, ఇప్పుడు రేవంత్

# మీది పగటి కల

- ఎవరెన్ని కుట్రలు చేస్తారో చేయండి
- రంగారెడ్డికి గోదావరి నీళ్లు ఇవ్వాలన్న ఆలోచన కేసీఆర్‌కు రాలేదు
- తాండూరులో కాగ్నా నీళ్లు పారిస్తా
- పరిగి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**మరో ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన**



**ముద్ర, వికారాబాద్ :**
కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో అధికారంలో రానీయకుండా మాజీ సీఎం కేసీఆర్.. మూడేళ్ల క్రితం విశ్వప్రయత్నాలు చేసి విఫలమయ్యారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అయినా ఐదేళ్ల కోసం తాము అధికారంలో వచ్చామన్నారు. భవిష్యత్తులో ప్రజా ప్రభుత్వంపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. వచ్చే ఎనిమిదేళ్లూ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనే కొనసాగుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పాలన తీరు. తనను విమర్శిస్తోన్న కేసీఆర్... కల్వకుంట్ల కిషన్ రావు(కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి) ఈ విషయాన్ని రాసి పెట్టుకోవాలని సూచించారు. నువ్వు, నీ తాతలు ఎవరెవరు ఎన్నికల్లో అడ్డం వస్తారో రండి.. ఏ కుట్రలు చేస్తారో చేయండి.. చూద్దాం... అని సీఎం సవాల్ చేశారు. "ప్రజా పాలన– ప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా శనివారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామన్నారు. స్థానిక సమస్యలు మిగతా 02లో

# ట్రిపుల్ తలాక్ రద్దును అన్ని పార్టీలు అడ్డుకున్నాయి

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

- ముస్లిం మహిళలకు భరోసా కల్పించిన బీజేపీ
- వారి గురించి ఓవైసీ ఎప్పుడైనా మాట్లాడారా?
- పొరపాటున కాంగ్రెస్ ను గెలిపిస్తే.. మీ మెడలోని బంగారాన్ని కూడా కొట్టేస్తారు
- బీజేపీ అభ్యర్థులు గుణవంతులు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ధనవంతులు 03



**మూడు రోజుల్లో**

# రూ.8.06 కోట్ల ఆదాయం

సమ్మక్క–సారక్క జాతర హుండీల లెక్కింపు మూడో రోజు 02



నేటి ముద్ర

టీ20 వరల్డ్ కప్ ప్రారంభంతో ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఫీవర్ మొదలైంది



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08.02.2026
www.mudranews.in | @mudranews



## టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు




**భారత్**

బ్యాటింగ్, బౌలింగ్‌లో సమతుల్య జట్టుగా భారత్ ఎప్పుడూ ఫేవరెట్. ఐపీఎల్ అనుభవం యువ ఆటగాళ్లకు పెద్ద బలం.

# ఎవిడెన్స్ బూడిద!?



**(మొదటి పేజీ తరువాయి)**

బూడిదైంది. దాదాపు 50 కంప్యూటర్లు బూడిదలో కలిసిపోయాయి. ఇప్పటి వరకు సేకరించిన ఎవిడెన్స్ మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయి. అయితే, తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్ కావడం వల్ల అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ల్యాబ్‌లో డీఎన్ఏ పరీక్షలు, ఫింగర్‌ప్రింట్ విశ్లేషణతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు కీలక కేసుల్లో ఆధారాల ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ లోనే ఉన్నాయి. ఎఫ్ఎస్ఎల్ కంటే కార్యాలయంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఆధా రాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఫస్ట్ ఫ్లోర్ లో కంప్యూటర్ ల్యాబ్ తో పాటు కీలకమైన గదులు ఉండటంతో.. పలు కేసుల్లో సేకరించిన పేపర్ వర్క్ ఎవిడెన్స్ సైతం ఫస్ట్ ఫ్లోర్ లోనే ఉంది. మంటలు అదుపులోకి వచ్చినా శనివారం రాత్రి వరకు ఏమేం ఎవిడెన్స్ కాలిపోయాయి.. ఎంత వరకు నష్టం వాటిల్లింది అనే వివరాలు ప్రకటించలేదు.

కాగా, పది రోజుల క్రితం నాంపల్లి బచాస్ ఫర్నీచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఫర్నీచర్ దుకాణంలోని సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. అయితే అప్పటికే సెల్లార్‌లో వాచ్‌మెన్ ఇద్దరు పిల్లలు, మరో మహిళ ఉండిపోయారు. వారు బయటకు వచ్చేందుకు దారి లేకపోవటంతో వారిని రక్షించేందుకు అక్కడే పని చేసే మరో ఇద్దరు యువకులు వెళ్లారు. ఆ ముగ్గుర్ని రక్షించే క్రమంలో దట్టమైన పొగ కమ్ముకొని వారికి దారి కనిపించలేదు. అక్కడ ఫర్నీచర్ తయారీకి వాడే ఫోమ్, ఇతర సామాగ్రి ఉండటంతో మంటల తీవ్రత పెరిగింది. దీంతో ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 18 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత వారి మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు.

ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు అగ్నికి ఆహుతయినట్లుగా తెలుస్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి. ఈ ప్రమాద సమయంలో లోపల ఉన్న ఒక వ్యక్తికి గాయాలు కాగా, వెంటనే అప్రమత్తమైన సహచరులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద వార్త తెలియగానే డీసీపీ శిల్పవల్లి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వంటి అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే చోట అగ్నిప్రమాదం జరగడంపై ఆమె అధికారులను ఆరా తీశారు. అసలు మంటలు ఎలా మొదలయ్యాయి? షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు.

**ఓటుకు నోటు కేసు నుంచి సిట్ దాకా..**

ఈ ప్రమాదంలో అత్యంత ఆందోళన కలిగించే అంశాలు బయటకు వస్తున్నాయి. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న అనేక కీలకమైన కేసుల డేటా , భౌతిక పత్రాలు కాలి బూడిదయ్యాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పలు నేరాలకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు ఈ ల్యాబ్‌లోనే ఉన్నాయి. సాక్ష్యాలు బుగ్గిపాలు కావడంతో ఆయా కేసుల విచారణపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నఓటుకు నోటు కేసుకు సంబంధించిన ఫైళ్లు ఇక్కడే ఉన్నాయి. ఈ కేసులో ఎమ్మెల్యే సెబాస్టియన్ ను ప్రలోభాలకు గురి చేసినట్లు కేసు నమోదైంది. దీం తో పాటుగా బీఆర్ఎస్ హయాంలో బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించిన ఫైళ్లు కూడా ఇక్కడే ఉన్నాయి. ఫైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్ లో ఈ చర్చలు జరిగినట్లు కేసు నమోదైంది. దీనికి సంబంధించిన కేసులో కొన్ని ఎవిడెన్స్ దొరికాయని అప్పుడు విచారణ బృందం భావించింది. ఇందులో బీజేపీ నేత బీఎల్ సంతోష్ మీద కూడా కేసు నమోదైంది. అదే విధంగా బీఆ ర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఫైళ్లు కూడా ఇక్కడే ఉన్నాయి. ఈ కేసులో మాజీ సీఎం కేసీఆర్ సహా మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆ ర్ ను విచారించారు. అంతకు ముందు పలువురు పోలీసు అధికారులను సైతం విచారించి కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్క్ లను స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటినీ ఇక్కడే భద్ర పరిచారు. కానీ, ఇప్పుడు అవన్నీ కాలి బూడిదయ్యాయి.

**కుట్ర కోణం ఉందా?**

సాధారణంగా ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉంటాయి. అలాంటిది కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడం, కీలక పత్రాలు ఉన్న చోటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా? అనే కుట్ర కోణంపై పోలీసులు దృష్టి సారించారు. ల్యాబ్‌లోని సీసీటీవీ విజువల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. క్లూస్ టీమ్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కంప్యూటర్లలోని హార్డ్ డిస్క్‌లు ఎంతవరకు దెబ్బతిన్నాయి, వాటి నుంచి డేటాను రికవరీ చేసే అవకాశం ఉందా అనే దానిపై ఐటీ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ నివేదికలు తారుమారైతే నేరస్తులకు మేలు జరుగుతుందనే కోణంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

**అనుమానాలు వ్యక్తం చేసిన కేటీఆర్**

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కేటీఆర్ స్పందించారు. కాగా, బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ కూడా ట్విట్టర్ వేదికగా స్పందించారు. మొత్తం ల్యాబ్ కాలిపోతుంది.. ఏ ఆధారాలు నాశనం చేశావు అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

కాగా, ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె వెల్లడించారు. 5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు.

**విలువైన హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతి:**

**డీఎఫ్ఓ శ్రీ దాస్**

తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీదాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. ఇవాళ ఉదయం 10.22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు. హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా? పాక్షికంగా కాలాయా? అన్నది పరిశీలించాలని డీఎఫ్ఓ తెలిపారు.

# గల్లీ ఎన్నికలు.. ఢిల్లీ రాజకీయం

**(మొదటి పేజీ తరువాయి)**

రెడ్డి సఫలమయ్యారు. నిజామాబాద్ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. దీనివల్ల ఓటరు దృష్టి స్థానిక కౌన్సిలర్ పనితీరు కంటే రాష్ట్రస్థాయి రాజకీయాల వైపు మళ్లుతోంది.

**ఇప్పటికే ట్రాప్‌లో పడిపోయిన విపక్షాలు**

ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పార్టీ శ్రేణులకు పదే పదే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కాంగ్రెస్ సెట్ చేసే రాజకీయ ట్రాప్‌లో పడొద్దని, ప్రజల వద్దకు వెళ్లేటప్పుడు స్థానిక సమస్యలను, కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపాలని కోరారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి చేసే రాజకీయ విమర్శలకు కౌంటర్ ఇవ్వడానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో స్థానిక అంశాలను హైలెట్ చేయడంలో విపక్షాలు విఫలమవుతున్నాయని, తద్వారా రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా విసిరిన వలలో వారు చిక్కుకున్నారనే సూచనలు కనిపిస్తున్నాయి.ప్రధాన ప్రతిపక్షాలు అయిన బీఆర్ఎస్, బీజేపీ స్థానిక సమస్యలు, మున్సిపాలిటీల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను చర్చలోకి తీసుకురావడంలో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నాయి. కేవలం ముఖ్యమంత్రి ని విమర్శించడానికే ప్రాధాన్యత ఇస్తుండటంతో, ఓటర్లు కూడా స్థానిక అభ్యర్థి వ్యక్తిత్వాన్ని, పనితీరును గమనించడం మానేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్ల రూపం లోకి మార్చుకోవాలంటే ఉండాల్సిన గ్రౌండ్ లెవల్ అజెండా ప్రతిపక్షాల వద్ద కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రజల ఓటింగ్ ప్రయారిటీ ఏమిటి?**

మున్సిపల్ ఎన్నికల ద్వారా తమ గల్లీలోని సమస్యలు తీరతాయని ఆశించిన ప్రజలకు, నేతల మధ్య సాగుతున్న రాజకీయమే కనిపిస్తోంది. ప్రతిపక్షాలు తమ పంథా మార్చుకోకుండా ఇదే రాజకీయ ట్రాప్‌లో కొనసాగితే, అది అధికార పార్టీకి మరింత అడ్వాంటేజ్‌గా మారే అవకాశం ఉంది. ఫలితంగా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు స్థానిక అవసరాల కంటే, రాజకీయ బలబలాలను నిరూపించుకునే రిఫరెండంలా మారబోతున్నాయి. ఈ ఎన్నికల ప్రచారం ముగిసేలోపు విపక్షాలు కేటీఆర్ చెప్పినట్లుగా స్థానిక అజెండాను ఎంతవరకు ప్రజల్లోకి తీసుకెళ్లగలవు అనే దానిపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాలను అధిగమించి, ప్రజల కష్టాలను చర్చలోకి తీసుకువస్తేనే విపక్షాలకు మైలేజీ లభిస్తుంది. లేదంటే ఈ ఎన్నికలు కేవలం రాజకీయ రంగు పులుముకున్న వార్ లాగే మిగిలిపోతున్నట్లు గా మారింది.




**మధ్యలో రెబెల్స్**

మరోవైపు ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు సొంత నేతల నుంచే పోరు తప్పడం లేదు. పార్టీలు జారీ చేసిన బీ–ఫారాలు ఒకరికి దక్కితే, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించారంటూ పలువురు నేతలు స్వతంత్రులుగా జెండా ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,700 మంది అభ్యర్థులు తమ నామినేషన్ల ను ఉపసంహరించుకున్నప్పటికీ, ఇంకా 12,900 మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో మెజారిటీ అభ్యర్థులు ప్రధాన పార్టీలకు చెందిన రెబల్స్ కావడం గమనార్హం. గెలుపు గుర్రాల కంటే, ప్రత్యర్థి గెలుపును అడ్డుకునే ఓట్ల చీలిక వ్యూహంతో వీరు ముందుకు వెళ్తుండటం పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా ఉంది.

**కాంగ్రెస్‌కు అధికార బలంతో పాటు అసమ్మతి సెగ**

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ సమస్య అత్యధికంగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని భావించిన ఆశావాహులు టికెట్ ఆశించారు. కానీ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై పాత క్యాడర్ భగ్గుమంటోంది. ఉదాహరణకు జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య టికెట్ల కేటాయింపు వివాదం రచ్చకెక్కింది. ఇలాంటి పరిస్థితులే మెదక్, గద్వాల వంటి చోట్ల కూడా కనిపిస్తున్నాయి. బీ–ఫారాల పంపిణీలో జరిగిన జాప్యం, సమన్వయ లోపం వల్ల కాంగ్రెస్‌లో రెబల్స్ సంఖ్య పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**బీఆర్ఎస్‌లోనూ అంతర్గత కుమ్ములాటలు**

ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. పార్టీని నమ్ముకుని ఉన్న స్థానిక నేతలు, టికెట్ దక్కని పక్షంలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని భావించి బరిలోకి దిగారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా సొంత పార్టీ వారే భారీగా నామినేషన్లు వేశారు. కొందరు నేతలు ఇతర పార్టీల నుంచి వచ్చిన విమర్శలకు కౌంటర్ ఇవ్వడం కంటే, సొంత పార్టీ అభ్యర్థులనే టార్గెట్ చేయడం అధిష్టానాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. క్రమశిక్షణ చర్యల హెచ్చరికలు జారీ చేసినా చాలా మంది వెనక్కి తగ్గకపోవడం గమనార్హం.

**కమలంలోనూ ముదిరిన అసంతృప్తి**

కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలోనూ పుంజుకుంటున్నామన్న ధీమాతో ఉన్న బీజేపీలోనూ రెబల్స్ బెడద తప్పలేదు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ పకడ్బందీగా అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని చోట్ల ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి కాకుండా కొత్తగా చేరిన వారికి టికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తు న్నాయి. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు రెబల్స్ పై సీరియస్ అయ్యారు. నామినేషన్లు ఉపసంహరించుకోని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ, నిజామాబాద్, అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు రెబల్స్ గట్టి పోటీ ఇస్తున్నారు.

ఈ రెబల్స్ ప్రభావం వల్ల బహుముఖ పోటీ నెలకొంది. విజేతను నిర్ణయించే మేజారిటీ ఓట్లు ఈ స్వతంత్రుల ఖాతాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. కేవలం 100 నుండి 500 ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే మున్సిపల్ వార్డుల్లో, ఈ రెబల్స్ చీల్చే 50 ఓట్లు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తాయి. దీనివల్ల కొన్ని చోట్ల ప్రధా న పార్టీల అభ్యర్థులు ఓడిపోయి, స్వతంత్రులు కింగ్ మేకర్లుగా లేదా విజేతలుగా అవతరించే అవకాశం ఉంది. ఫిబ్రవరి 11న జరిగే పోలింగ్‌లో ఈ రెబల్స్ ఎవరి కొంప ముంచుతారో, ఎవరికి వరం అవుతారో తేలిపోనుంది.

## మూడు రోజుల్లో రూ.8.06 కోట్లు

**మేడారం/హనుమకొండ, ఫిబ్రవరి 7:**

సమ్మక్క–సారక్క జాతర–2026 సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హూండీల లెక్కింపు మూడో రోజు కూడా హనుమకొండలోని టిటిడి కళ్యాణ మండపంలో కొనసాగింది. దేవాదాయ శాఖ ధికారులు, సేవా సభ్యుల పర్యవేక్షణలో ఈ లెక్కింపు ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. జాతరకు సంబంధించి మొత్తం 828 హూండీలు ఏర్పాటు చేయగా, ఇందులో 780 ఇనుప హూండీ లు, 45 వస్త్ర హూండీలు, 3 బియ్యం హూండీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడో రోజు 140 హూండీలను తెరిచి లెక్కిం చగా, వాటి ద్వారా రూ.2,01,21,440 ఆదాయం లభించింది. అదనంగా విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.71,283 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 5న 125 హూండీల లెక్కిం పులో రూ.2,49,65,000, ఫిబ్రవరి 6న 160 హూండీల లెక్కిం పులో రూ.3,54,25,200తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.63,436 ఆదాయం లభించింది. మూడు రోజుల వ్యవధిలో మొత్తం 425 హూండీలను లెక్కించగా, రూ. 8,06,46,359 ఆదాయం సమకూరినట్లు అధికారులు స్పష్టం చేశారు.మూడో రోజు లెక్కించిన నగదులో నుంచి రూ.2,01,92,723 మొత్తాన్ని పర్యవేక్షణాధికారుల సమక్షంలో బ్యాంకు అధికారులకు అప్పగించి బంగారం, వెండి వేర్వేరుగా ఇనుప హూండీలలో భద్రపరచి భద్రంగా ఉంచినట్లు పేర్కొన్నారు.

## రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు డిమాండ్

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లకు మరోసారి మార్కెట్‌లో భారీ డిమాండ్ నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్టుకు సమీపంలోని తొర్రూర్ ప్రాంతంలో నిర్వహించిన బహిరంగ వేలంలో ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. చదరపు గజం గరిష్టంగా రూ.45 వేల వరకు పలకగా, తొలిరోజే 70 ప్లాట్ల విక్రయంతో సుమారు రూ.56 కోట్ల ఆదాయం లభించింది. కార్నర్ ప్లాట్లకు తీవ్ర పోటీ నెలకొనడం ఈ ప్రాంతానికి ఉన్న ఆకర్షణను చాటింది. అదే సమయంలో బండ్లగూడ నాగోలు, పోచారం ప్రాంతాల్లో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ ఫ్లాట్లకు కూడా మంచి స్పందన వచ్చింది. మధ్యతరగతి, అల్పాదాయ వర్గాల కోసం కేటాయించిన 71 ఫ్లాట్లను లాటరీ ద్వారా ఎంపిక చేయగా, దీనివల్ల కార్పొరేషన్‌కు దాదాపు రూ.11 కోట్ల ఆదాయం సమకూరింది. మొత్తం మీద రాజీవ్ స్వగృహ ప్రాజెక్టులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని అధికారులు తెలిపారు.

## మీది పగటి కల

**(మొదటి పేజీ తరువాయి)**

పరిష్కరించేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నించడం లేదని విమర్శించారు. కేటీఆర్‌కు ఇన్నాళ్లూ వికారాబాద్, తాండూర్ ఎందుకు గుర్తురాలేదు.? రంగారెడ్డికి గోదావరి నీళ్లు ఇవ్వాలన్న ఆలోచన కేసీఆర్‌కు ఎందుకు రాలేదని నిలదీశారు.

**చంద్రబాబుకు సలహాలు తప్ప నీళ్లివ్వలేదు..**

గోదావరి జలాల్లో 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని వాటిని తరలించుకుపోవాలని కేసీఆర్.. నాడు చంద్రబాబుకు సలహాలు ఇచ్చారని సీఎం రేవంత్ ఆరోపించారు. 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తుంటే కళ్లప్పగించి చూసిన కేసీఆర్.. అందులో 300 టీఎంసీలు రంగారెడ్డి జిల్లాకు ఇస్తే 30 లక్షల ఎకరాలకు సాగు నీరు వచ్చి ఉండేదన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఏం పాపం చేశారని గోదావరి జలాల సాధనలో నిర్లక్ష్యం చేశారని కేసీఆర్ ను నిలదీశారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ. 38 వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పూనుకున్నారన్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూళేశ్వరం అయిందన్నారు. దాంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయని ఆరోపించారు. గోదావరి జలాల ముసుగులో రూ. వేలకోట్లు కొల్లగొట్టారని మండిపడ్డారు.

**గోదావరి జలాలతో కాళ్లు కడుగుతా**

గోదావరి జలాలతో తాండూరు, వికారాబాద్ పరిగి ప్రజల కాళ్లు కడుగుతామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ నీటితో ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే మూడేళ్లలో మక్తల్ – నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. లక్షి దేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులతో పాటు అవసరమైన ప్రణాళికలకు రూపకల్పన చేస్తామన్నారు. తాండూరు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు కాగ్నా నది నీళ్లు ఇస్తామన్నారు. ఏడాది తిరిగేలోపు అప్పా జంక్షన్ నుంచి మన్నె గూడ, అక్కడి నుంచి తాండూరు వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. సబితా ఇంద్రారెడ్డికి అన్ని పదవులు ఇచ్చినా ఆమె పార్టీ ఫిరాయించారని సీఎం ఆరోపించారు. నాడు రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసమే పార్టీ ఫిరాయిస్తున్నానని చెప్పిన ఆమె.. ఎందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎందుకు నిధులు, అనుమతులు తీసుకురాలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. చేసిన ద్రోహానికి ప్రజలను కలిసేందుకు సబితా ఇంద్రారెడ్డికి నైతిక హక్కు లేదని విమర్శించారు. పదేళ్లు కేసీఆర్, కేటీఆర్ మున్సిపాలిటీల వైపు చూడలేదన్నారు. తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లను పూర్తి చేస్తామన్న సీఎం.. రానున్న రోజుల్లో వికారాబాద్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారబోతోందని జోస్యం చెప్పారు. అనేక సమస్యలను అధిగమిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోందనీ ప్రజలందరూ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. తెలంగాణలో ప్రధానంగా రైతాంగం, నిరుద్యోగ యువత, మహిళలు ప్రాధాన్యంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి.. వాటిని వివరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలోని 6,650 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి కింద రూ. 567.69 కోట్ల చెక్కును సీఎం.. మహిళా ప్రతినిధులకు అందజేశారు. ఈ సభలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
08.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు**

ఆస్ట్రేలియా
ఒత్తిడిలోనూ చల్లగా ఆడే జట్టు ఆస్ట్రేలియా. పవర్ హిట్టింగ్, వేగవంతమైన బౌలింగ్ వీరి అస్త్రాలు.







# అమరావతిలో క్వాంటం వ్యాలీ

**ముద్ర, అమరావతి:**

అమరావతిని ప్రపంచ టెక్నాలజీ పటంలో నిలబెడుతూ దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీకి రాజధాని వేదికైంది. ఉద్దండరాయునిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఘనంగా ఈ వ్యాలీకి శంకుస్థాపన చేశారు. భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానమైన క్వాంటం కంప్యూటింగ్ రంగానికి అమరావతిని కేంద్రీకృతం చేస్తూ, బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి ప్రపంచ స్థాయి నగరాల సరసన రాజధానిని నిలబెట్టడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.

దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో, 8.5 మిలియన్ చదరపు అడుగుల భారీ నిర్మాణంతో ఈ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇందులో భాగంగా 48, 29 అంతస్తులతో 8 భారీ టవర్లను ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్మించనుంది. అలాగే రెండు ఎకరాల్లో ప్రత్యేకంగా నిర్మించే క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ భవనంలో ఐబీఎం సంస్థ క్వాంటం కంప్యూటర్లను తయారు చేయనుండగా, ప్రముఖ ఐటీ దిగ్గజం TCS సాఫ్ట్‌వేర్ సేవలను అందించనుంది. ఈ కేంద్రం ద్వారా 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్ అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపిరి పోయడమే కాకుండా వేల సంఖ్యలో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు నాటికి క్వాంటం వ్యాలీ ప్రారంభం కానుంది. డిసెంబర్ నాటికి క్వాంటం కంప్యూటర్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. భవిష్యత్తులో ప్రపంచ దేశాలకు క్వాంటం కంప్యూటర్లను ఎగుమతి చేసే గ్లోబల్ హబ్‌గా అమరావతి ఎదగనుంది.

# ముస్లిం మహిళలు ఏకం కావాలి

- **ట్రిపుల్ తలాక్ రద్దుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యతిరేకం?**
- **ముస్లిం మహిళల సమస్యలపై ఒవైసీ ఎన్నడూ మాట్లాడలేదు?**
- **బీజేపీతోనే దేశాభివృద్ధి**

**ముద్ర, కరీంనగర్:**

ముస్లిం మహిళలంతా ఏకమై బీజేపీని గెలిపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ట్రిపుల్ తలాఖ్ రద్దు వల్ల ముస్లిం మహిళలకు మేలు జరిగిందా? లేదా? అనే విషయంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సమాధానం చెప్పాలని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కరీంనగర్ లోని బుట్టి రాజారాం కాలనీలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నగరంలోని 25, 26, 27 డివిజన్ల బీజేపీ అభ్యర్థులు కటకం లోకేశ్, డాక్టర్ పుల్లెల ప్రవీణ్, చాడ ఆనంద్ సతీమణి తంబాల నవ్యశ్రీలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదర్శనగర నుంచి కోర్టు చౌరస్తా వరకు స్మార్ట్ సిటీ నిధులతోనే మెయిన్ రోడ్డు నిర్మించామని, 26వ డివిజన్లో ఇంటర్నల్ రోడ్స్ చాలా వరకు కేంద్ర నిధులతోనే నిర్మించామని అన్నారు. ముఖ్యంగా సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలను కోటి రూపాయలతో మోడల్ స్కూల్ గా మార్చామని చెప్పారు. 25వ డివిజన్లో పెద్దగా అభివృద్ధి కన్పించడం లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని అన్నారు. అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు.

25, 26, 27 డివిజన్లలో పోటీ చేస్తున్న మా బీజేపీ అభ్యర్థులు కటకం లోకేష్, డాక్టర్ పుల్లెల పవన్, తంబాల నవ్యశ్రీ చాడ ఆనంద్ గుణవంతులని వారిని గెలిపిస్తే కంటికి రెప్పలా కాపాడుకుంటారని అన్నారు. బీజేపీని గెలిపించి మేయర్ పీఠం అప్పగిస్తే అభివృద్ధిలో మీ డివిజన్ల రూపురేఖలు మారుస్తారని తెలిపారు.





# రాజీనామా చేయ్..

- **సీఎం రేవంత్ కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్**
- **రేవంత్ రెడ్డే కేసీఆర్‌ను కాపాడేది..**
- **గతంలో అసదుద్దీన్ బుల్లెట్‌పై కేసీఆర్, ఇప్పుడు రేవంత్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ము లేని సీఎం రేవంత్ రెడ్డి.. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఇతర కుంభకోణాల్లో కేసీఆర్ పై చర్యలు తీసుకునే దమ్ము అసలు రేవంత్ రెడ్డికి ఉందా..? లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ము రేవంత్ రెడ్డికి ఉంటే.. బహిరంగ ప్రకటన చేయాలని సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన కుంభకోణాలు, అక్రమాలకు కారకుడైన కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా ఎవరు అడ్డుకుంటున్నారో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.. కాళేశ్వరం అవినీతి విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌ను జైలుకు పంపిస్తానని ఎన్నికల ముందు చెప్పిన మాటలు ఏమయ్యాయని నిలదీశారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్‌పై ఈగ, దోమ వాలకుండా కాపాడుతున్నారని ఆరోపించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? ఎవరు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ ను రాహుల్ గాంధీ అడ్డుకుంటున్నాడా? కాంగ్రెస్ అధిష్టానం అడ్డుకుంటున్నదా? దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డే కేసీఆర్‌ను కాపాడుతున్నారని కుండబద్దలు కొట్టారు.

**బీజేపీ, మోడి సత్తా చూపిస్తాం**

బీఆర్ఎస్‌కాంగ్రెస్ మధ్య డూప్ డైలాగులు నడుస్తున్నాయని కిషన్ రెడ్డి సెటైర్లు వేశారు. ప్రధానమంత్రి మోదీని రాజకీయంగా ఎదుర్కోలేకే ఆయా పార్టీలు ఈ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్న కిషన్ రెడ్డి... అప్పుడు బిజెపి సత్తా ఏంటో, మోడి సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి...తన వైఫల్యాలకు బాధ్యత తీసుకోకుండా, మా భుజాలపై బందూకు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కూడా తన అసమర్థతను కేంద్ర ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేశారన్నారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులనీ మాటలతో మభ్యపెట్టి కాలం గడిపేయాలనుకుంటే, రేవంత్ రెడ్డిని ఎవ్వరూ రక్షించలేరని చెప్పారు. ముఖ్యమంత్రి పదవికి ఒక గౌరవం, విలువ ఉంటుందన్న కిషన్‌రెడ్డి.. రేవంత్ రెడ్డి ఆ విలువలు ఏ మాత్రం పాటించకుండా, గాలి మాటలతో, బాధ్యతలేని వ్యాఖ్యలతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

**నాడు కేసీఆర్...**
**నేడు రేవంత్ ఎంఐఎంకు జీ హుజూర్..**

కాంగ్రెస్ పార్టీలో బుజ్జగింపు రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ముస్లింల ఓట్ల కోసం "కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్" అని సీఎం స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి మాట్లాడిన దిగజారుడు వ్యాఖ్యలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ అయినా, బీఆర్ఎస్ అయినా... అధికారంలో ఉన్న పార్టీ మజ్లిస్ కనుసైగల్లో పాలన చేయడం తెలంగాణ ప్రజల దురదృష్టమన్నారు. గతంలో సీఎంగా ఉన్న సమయంలో కేసీఆర్ అసదుద్దీన్ ఒవైసీ బుల్లెట్‌పై అతని ఇంటికి వెళ్లాడన్నారు. అప్పుడు బుల్లెట్ నడిపింది ఓవైసీ.. కూర్చున్నది కేసీఆర్ అన్నారు. నేడు సీట్లు మారాయి గానీ డ్రైవర్ మారలేదని సెటైర్లు వేశారు. ఇప్పుడు బుల్లెట్ నడిపేది ఓవైసీయే కానీ అందులో కూర్చున్నది రేవంత్ రెడ్డి అన్నారు. అప్పుడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్ ఇద్దరికీ స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సత్తా వాళ్లకు లేదన్నారు. బీఆర్ఎస్‌కాంగ్రెస్ పార్టీలు ఎంఐఎం పార్టీకి బానిసలుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి గురించి మాట్లాడాల్సిన సీఎం... మతపరమైన రిజర్వేషన్ల గురించి మాట్లాడటం దురదృష్టకరమని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికలకు ముందు మజ్లిస్ పార్టీని ప్రసన్నం చేసుకోవడం, మజ్లిస్ ఓట్లు పొందడం కోసం ఎత్తుగడలు వేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 శాతం ముస్లిం రిజర్వేషన్లను హైకోర్టు రెండుసార్లు కొట్టివేసిందన్నారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయినా సుప్రీంకోర్టు స్టేను అడ్డుపెట్టుకుని చట్టబద్ధత లేని 4 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. మతపరమైన సమావేశం నిర్వహించిన సీఎం.. ముస్లింలకు శాశ్వతంగా 4 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించడం కచ్చితంగా ఓటుబ్యాంకు రాజకీయాలేనన్నారు.



**ఆ అగ్నిప్రమాదంపై అనుమానాలు ఉన్నాయి**

శనివారం నాంపల్లిలోని రెడ్ హిల్స్‌లో ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో జరిగిన అగ్నిప్రమాదంపై కిషన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆ ల్యాబ్‌లోని కంప్యూటర్లలో వందలాది కేసులకు సంబంధించిన కీలక డేటా, టెక్నికల్ ఎవిడెన్స్, ఫోరెన్సిక్ ఎవిడెన్స్ నిల్వ ఉన్నాయని సమాచారం అందిందన్నారు. ఈ అంశం తీవ్రమైందన్నారు. ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి హైప్రొఫైల్ కేసులకు సంబంధించిన డిజిటల్ ఎవిడెన్స్ అక్కడ ఉందా? లేదా? అన్నది ప్రభుత్వం వెంటనే ప్రజలకు చెప్పాలన్నారు. అందులో టెక్నికల్ ఎవిడెన్సీ, ఫోరెన్సిక్ ఎవిడెన్సీ ఉందా లేదా అనేది స్పష్టంగా ప్రకటించాలన్నారు.ఉంటే బ్యాకప్ ఉందా లేదనేది ప్రకటించాలన్నారు. ఇలాంటి హై లెవల్ కేసులకు సంబంధించిన ఆధారాలు ఒకే చోట ఉండి, అదే చోట అగ్నిప్రమాదం జరగడంపై అనేక ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికారికంగా, బాధ్యతతో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

# ఆధిపత్యం కావాలా? అభివృద్ధి కావాలా?

- **తూప్రాన్ ప్రజలు ఆలోచించాలి**
- **బూతుల సీఎంకు బుద్ధిచెప్పండి..**
- **మాజీ మంత్రి హరీష్ రావు**

**ముద్ర, తూప్రాన్:**

తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అల్లాపూర్ చౌరస్తా నుండి తూప్రాన్ బస్టాండ్ వరకు మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు భారీ రోడ్ షో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ... తూప్రాన్ అభివృద్ధిని గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు.ఒకప్పుడు తూప్రాన్‌లో మంచినీళ్లు కావాలంటే మూడు రోజులకోసారి వచ్చేవి. గీతా రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బిందెలతో అడ్డం పడి నిరసన తెలిపేవాళ్లు.

కానీ కేసీఆర్ వచ్చాక ప్రతి ఇంటికి నల్లా పెట్టి ఆడబిడ్డల నీళ్ల కష్టాలు తీర్చారని గుర్తుచేశారు. తూప్రాన్‌ను మున్సిపాలిటీ చేసింది, ఆర్డీవో ఆఫీస్ తెచ్చింది, ఫోర్ లైన్ రోడ్లు వేసి హైవేలా మార్చింది కారు గుర్తు కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ రాకముందు తూప్రాన్‌కు పిల్లనియ్యాలంటే నీళ్లు మోపిస్తారని భయపడేవాళ్లని, ఇప్పుడు తూప్రాన్‌కే పిల్లనియ్యాలన్నట్టు పరిస్థితి మారిందని అన్నారు. పది లక్షలు లేని భూమిని కోటి రూపాయలు చేసింది కేసీఆర్ కాదా అని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు పాతాళానికి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, నర్సారెడ్డి, మైనంపల్లి మధ్య ఆధిపత్యం కోసం ప్రజలను బలి చేస్తున్నారని గుర్తు చేశారు. మీకు ఆధిపత్య రాజకీయాలు కావాలా? లేక అభివృద్ధి కావాలా? ఆలోచిం ఓటు వేయాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. రెండేళ్ల నుంచి తూప్రాన్ అభివృద్ధిని అడ్డుకున్నారని, రోడ్లకు గుంతలు పడితే డాంబర్ వేసే దిక్కు కూడా ఈ ప్రభుత్వానికి లేదని అన్నారు. 50 పడకల ఆసుపత్రిలో డాక్టర్లు లేక మెదక్, గజ్వేల్ కు పంపుతున్నారని అన్నారు. మహిళలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని, ఇప్పటి వరకు ఒక్కొక్కరికి రూ.65,000 బాకీ పడ్డాడని గుర్తు చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎగగొట్టిన ఘనత కేవలం రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు పంట పంటకు రైతుబంధు పడేదని, కరోనా కష్టకాలంలో కూడా ఆపలేదని అన్నారు. ఇప్పటికే రేవంత్ రెడ్డి రెండు రైతు బంధులు ఎగ్గొట్టాడని అన్నారు. బీజేపీ వాళ్లు ఓట్ల కోసం గిర్ర గిర్ర తిరుగుతున్నారని, వాళ్లు తూప్రాన్‌కు ఏమైనా చేశారా? ఒక్క హాస్పిటల్ కట్టించారా? ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డికి కళ్ళు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని అన్నారు. హామీలు అడిగితే బూతులు మాట్లాడి సమాధానం చెబుతున్నాడని, అలాంటి బూతుల ముఖ్యమంత్రికి ఈ ఎన్నికలతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.



# నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- **పోలవరం ప్రాజెక్ట్ లో పీపీఏ సీఈఓ పర్యటన**
- **పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**
- **క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన**
- **సంతృప్తి వ్యక్తం చేసిన సీఈఓ**

**ముద్ర, పోలవరం:**

పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిని పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి యోగేష్ పైతాన్కర్ శనివారం సమీక్షించారు. ఢిల్లీ నుంచి పోలవరం ప్రాజెక్ట్ పనుల సమీక్ష, పరిశీలనకు వచ్చిన ఆయన తొలుత పీపీఏ చీఫ్ ఇంజనీర్ ఎం.రమేష్ కుమార్ తో కలిసి రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పీపీఏ ఉప సంచాలకులు ప్రవీణ్ వర్మ, రాష్ట్ర జల వనరుల శాఖ ఈఎన్సి కె నరసింహమూర్తి, ఎస్ఈ ఆర్.రామచంద్ర రావు, నాణ్యతా విభాగం చీఫ్ ఇంజనీర్ శేషుబాబు, ఎస్ఈ తిరుమల రావు, ఈఈ లు బాలకృష్ణ, శ్రీనివాస్, నరసింహారావు, ప్రేమ్ చంద్, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్టక్చర్ లిమిటెడ్(ఎం ఈ ఐ ఎల్) జనరల్ మేనేజర్ ఏ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి తదితరులు పాల్గొన్నారు. గత నెల చివరి వారంలో నాలుగు రోజుల పాటు విదేశీ నిపుణుల బృందం పోలవరంలో పర్యటించింది. ప్రాజెక్ట్ పనుల పురోగతిని పరిశీలించింది. పలు సూచనలు, సలహాలు చేసింది. ఆ తరువాత ఢిల్లీలో పీపీఏ సిఈఓ పైతాన్కర్ తో సమావేశమైంది. ఆ సమావేశం తరువాత పోలవరం పర్యటనకు వచ్చిన పైతాన్కర్ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై తొలుత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం ఆయన క్షేత్ర స్థాయిలో ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. విదేశీ నిపుణుల బృందం పర్యటనకు ముందు పైతాన్కర్ పోలవరంలో పర్యటించారు. తన గత, ప్రస్తుత పర్యటనల మధ్య ప్రాజెక్ట్ పనుల పురోగతిని, విదేశీ నిపుణుల పర్యటన సందర్భంగా చేసిన సూచనలు, ఇచ్చిన సలహాలు, వాటి అమలు తీరు గురించి ఆయన తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావాస పనుల పురోగతిని తెలుసుకున్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రాజెక్ట్ లో నిర్మాణం జరుగుతున్న గ్యాప్ 1, 2, ఈ సి ఆర్ ఎఫ్ పనులను పైతాన్కర్ పరిశీలించారు. వాటి నిర్మాణం జరుగుతున్న తీరు, పురోగతిపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో జలవనరుల శాఖ, ఎంఈఐఎల్ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా పైతాన్కర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నాయని తెలిపారు. అందుకు అనుగుణంగా అధికారులు, నిర్మాణ సంస్థ నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకుని పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆకృతులకు అవసరమైన అనుమతులు సాధ్యమైనంత త్వరగా మంజూరు చేస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని వెల్లడించారు.



# ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

లిటిల్ ఎల్లి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని, వివిధ శాస్త్రీయ అంశాలపై ఆధారపడి సృజనాత్మకమైన, ఆలోచనాత్మకమైన మోడళ్లను రూపొందించారు. విద్యార్థులు తమ మోడళ్లకు సంబంధించిన వివరాలను ఆత్మవిశ్వాసంతో స్పష్టంగా వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతంగా జరగడానికి డైరెక్టర్ బస్వరాజ్ గౌడ్ మార్గదర్శనం, ప్రిన్సిపల్ సిర్గా రావలి ప్రోత్సాహం ఎంతో దోహదపడింది. అలాగే ఉపాధ్యాయులు మరియు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని ఘన విజయంగా మలిచారు. ఈ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించి, వారి సృజనాత్మకతను వెలికి తీసే వేదికగా నిలిచింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 08.02.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## న_కలం

# తిరుమల ప్రసాదం పైనా రాజకీయాలు?



తిరుమల తిరుపతి దేవస్థానం కేవలం ఒక ఆలయం కాదు. అది కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీక. అక్కడ భక్తి ముందు పేద–ధనిక భేదాలు లేవు, కుల మతాలకూ స్థానం లేదు. హుండీలో పడే ప్రతి నాణెం వెనుక ఒక విశ్వాసం ఉంటుంది. అలాంటి పవిత్ర వ్యవస్థలో ప్రసాదం పేరుతో కల్తీ జరిగిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా భక్తులను కలవరపెట్టడం సహజం.

శ్రీవారి లడ్డూ అనేది ఆహార పదార్థం మాత్రమే కాదు అది ప్రసాదం. అందులో ఉపయోగించే ప్రతి పదార్థం పవిత్రతకు ప్రతీకగా భావిస్తారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యి స్థానంలో నాసి రకమైన పదార్థాలు, జంతు కొవ్వులు, రసాయనాలు కలిపిన మిశ్రమాలు వాడారన్న ఆరోపణలు నిజమైతే, అది కేవలం అవినీతి కాదు; అది కోట్లాది భక్తుల విశ్వాసాలపై జరిగిన దాడి.

**ఆర్థిక నేరమా? దైవద్రోహమా?**

సాధారణ ప్రభుత్వ విభాగాల్లో జరిగే కల్తీ ఒక రకమైతే, దేవుడి ప్రసాదంలో కల్తీ మరొక రకం. ఇక్కడ డబ్బు నష్టం కంటే విశ్వాస నష్టం ఎక్కువ. కమిషన్ల కోసం, లాభాల కోసం, పవిత్రతను తాకట్టు పెట్టడం క్షమించదగిన చర్య కాదు. ఈ వ్యవహారాన్ని కేవలం "టెండర్ లోపం" లేదా "నిర్వాహక తప్పిదం"గా కొట్టిపారేయడం సమస్య తీవ్రతను తక్కువ చేయడమే అవుతుంది.

**రాజకీయ అహంకారమే మూలకారణమా?**

భక్తుల ఆగ్రహానికి కారణం కల్తీ ఆరోపణలే కాదు—వాటిపై చూపిస్తున్న నిర్లక్ష్య ధోరణి. కొంతమంది పాలకులు ఓటు బ్యాంకుల లెక్కలతో మెజారిటీ హిందువుల మనోభావాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్న భావన బలపడుతోంది. "మేము ఏం చేసినా జరుగుతుంది" అన్న అహంకారమే ఇలాంటి ప్రమాదకర నిర్ణయాలకు దారి తీస్తుంది. తిరుమల లాంటి క్షేత్రాలను రాజకీయ ప్రయోగశాలలుగా మార్చడం ప్రమాదకరమైన ధోరణి.

**బాధ్యత ఎవరిది?**

ఈ అంశంపై సమగ్ర, పారదర్శక విచారణ జరగాలి. బాధ్యులెవరో స్పష్టంగా తేలాలి. తప్పు చేసిన వారు ఎంత పెద్దవారైనా శిక్ష తప్పకపోవాలి. ఇది కేవలం న్యాయపరమైన అవసరం కాదు—భక్తుల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి అవసరమైన కనీస చర్య.

**భక్తుల సందేశం స్పష్టం**

చట్టాలు తమ పని చేస్తాయి. కానీ ప్రజాస్వామ్యంలో చివరి తీర్పు ప్రజలదే. తమ దైవం, తమ విశ్వాసం తృణీకరించబడిందని భావించినప్పుడు భక్తులు మౌనంగా ఉండరు. రాజకీయంగా, సామాజికంగా సరైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత సమాజంపై ఉంది.

**దేవుడి ప్రసాదంలో అవినీతి అనేది ఒక మాయని మచ్చ. ఇది చేసిన వారు, చేయించిన వారు ఎవరివల్లైనా సరే చరిత్రలో మంచి గుర్తింపు పొందరు. సప్తగిరుల సాక్షిగా జరిగిన ఈ ఘటన, ధర్మాన్ని తాకితే పరిణామాలు ఎంత తీవ్రమో మరోసారి గుర్తు చేస్తోంది. విశ్వాసంతో ఆడుకుంటే ప్రజలు మరిచిపోరు.**

# తెరిచిన వేళలు



తెరిచిన తలుపులు —
అతిథులను ఆహ్వానిస్తాయి,
అందాలు చూపుతాయి,
ఆనందాలు అందిస్తాయి.

తెరిచిన పుస్తకాలు —
నిజాలు తెలుపుతాయి,
నిజాయితీ నిరూపిస్తాయి,
నమ్మకాలు కలిగిస్తాయి.

తెరిచిన కళ్ళు —
చూపు పరిధిని దాటి,
నిజాన్ని, న్యాయాన్ని
నిశ్శబ్దంగానే గుర్తిస్తాయి.

తెరిచిన నోరు —
అబద్ధాల మౌనాన్ని చెరిపి,
సత్యానికి స్వరం ఇచ్చి
సమాజాన్ని కదిలిస్తుంది.

తెరిచిన మనసులు —
ద్వేషపు తాళాల్ని విరిచివేసి,
అనురాగానికి, ఆలోచనకు
విశాలమైన స్థలాన్ని ఇస్తాయి.

తెరిచిన గతము —
జీవితపు గమ్యాల్లో దాచిన
కష్టసుఖాల సరుకును
ఒక్కొక్కటిగా బయటపెడతాయి.

తెరిచిన గుప్పెట్లు —
పిడికిలిలో దాచిన రహస్యాల్ని
వెదజల్లుతూ,
వెల్లడించటమే నిజమైన సద్గుణం
అని
మనసుకు నేర్పుతాయి.

ఇవన్నీ తెరిచినప్పుడే —
కాలమే తెరచుకుంటుంది,
మనిషి మనిషిగా ఎదిగి
జీవితం అర్థవంతమవుతుంది.

తెరిచిన వేళలే –
అంతరంగాల్లో నిద్రపోయిన
వెలుగుకు మేల్కొలుపు,
ఆలోచనల బహిరంగము.

తెరిచిన క్షణాల –
కాలం నిశ్శబ్దంగా నడుస్తుంది,
తెరిచిన వేళల –
మనసు తనే తనను
చదువుకుంటుంది.

- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.



# నిర్లక్ష్యం వద్దు... ఇవీ థైరాయిడ్ లక్షణాలే..

థైరాయిడ్ అనేది మెడ ముందు భాగంలో సీతాకోక చిలుక ఆకారంలో ఉండే చిన్న గ్రంథి. ఇది శరీర జీవక్రియను నియంత్రించే ముఖ్యమైన హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. థైరాయిడ్ ఒక దీర్ఘ కాలిక సమస్య. భారత దేశంలో ప్రతి పది మందిలో ఒకరి కన్నా ఎక్కువ మంది థైరాయిడ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.ఈ సమస్య మగవారిలో కన్నా, ఆడవారిలో దాదాపు రెట్టింపు కనిపిస్తుంది. గొంతు ముందు భాగంలో ఉండే థైరాయిడ్ గ్రంథి నుంచి ఉత్పత్తి అయ్యే హార్మోన్ ప్రభావం శరీరంలోని దాదాపు ప్రతి అవయవం మీదా ఉంటుంది.

**థైరాయిడ్ సమస్యలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి**

ఈ హార్మోన్ ఉత్పత్తి తగ్గితే హైపో థైరాయిడ్ అని, అధికంగా అయితే హైపర్ థైరాయిడ్ అని అంటారు. హైపో థైరాయిడ్ సమస్య హైపర్ థైరాయిడ్ కన్నా అయిదు రెట్లు అధికంగా ఉంది.

**పిల్లల్లో తెలివితేటలపై ప్రభావం**

గర్భిణుల్లో ఈ సమస్యను ముందుగా గుర్తించకపోతే, పుట్టే పిల్లల్లో మేధాపరమైన లోపాలు ఉండవచ్చు. చిన్న తనంలోనే ఈ సమస్య గుర్తించడం మంచిది. లేదంటే, పిల్లల ఎదుగుదల శారీరకంగానే కాదు, మానసికంగానూ మందగించే ప్రమాదం ఉంది.

**కాబట్టి థైరాయిడ్ సమస్యను ఆలస్యం చేయకుండా గుర్తించి, దానికి సరైన చికిత్స పొందడం చాలా ముఖ్యం.**

థైరాయిడ్ రక్త పరీక్ష రిపోర్ట్ ఎన్నో విషయాల మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, గత నెలలో కొన్ని రోజులు మందులు వేసుకోకపోయినా, ఈ మధ్య కాలంలో ఏమైనా ఇన్ఫెక్షన్ లేక జ్వరం వచ్చినా, ల్యాబ్ నమ్మకమయినది కాకపోయినా, ఆ రిపోర్ట్‌తో ఎలాంటి నిర్ధారణకు రాలేము. కాబట్టి కేవలం పేపర్ మీద ఉన్న నంబర్లను చూసి చికిత్స సూచించడం సరి కాదు. రోగిని వైద్యులు పరిశీలించి, వారిలో లక్షణాలను బట్టి మాత్రమే సరైన చికిత్స అందించగలం.

**లక్షణాలు ఇవీ..**

ముందుగా థైరాయిడ్ లక్షణాల గురించి తెలుసుకుందాం. ఆ తరవాత మందులు వాడుతున్నా, థైరాయిడ్ సాధారణానికి రాకపోవడనికి గల కారణాలు తెలుసుకుందాం.

**హైపో థైరాయిడ్ లక్షణాలు:** నీరసం, మలబద్ధకం, చర్మం, వెంట్రుకలు పొడిబారడం, ఎక్కువ నిద్ర, బరువు పెరగడం, నెలసరిలో రక్తస్రావం ఎక్కువగా లేక తక్కువగా అవ్వడం, గర్భస్రావం, చలిని తట్టుకోలేక పోవడం, గుండె తక్కువ సార్లు కొట్టుకోవడం, జుట్టు రాలడం, థైరాయిడ్ గ్రంథి వాపు తదితర లక్షణాలు ఉంటాయి.

**హైపర్ థైరాయిడ్ లక్షణాలు:** ఆకలి ఎక్కువ అవ్వడం, బరువు తగ్గడం, చెమటలు ఎక్కువ పట్టడం, చిరాకు, స్థిమితం లేకపోవడం, నిద్ర లేమి, నీరసం, ఎక్కువసార్లు విరేచనం అవ్వడం, నెలసరిలో రక్తస్రావం తక్కువగా అవ్వడం, వేడిని తట్టుకోలేక పోవడం, గొంతు ముందు వాపు, గుండె దడ అనిపించడం, కళ్ళు పెద్దవిగా అవ్వడం, చేతులు వణకడం వంటివి కనిపిస్తుంటాయి. థైరాయిడ్ రిపోర్టులో కనిపించే T3, T4 స్థాయిలు అనేవి మన శరీరంలోని అవయవాల జీవక్రియలకు సంబంధించినవి. అయితే, T3, T4 తయారీకి TSH ( థైరాయిడ్ స్టిములేటింగ్ హార్మోన్) అనేది అవసరం.

ఎప్పుడైతే శరీరంలో T3, T4 తగ్గుతాయో, అప్పుడు వీటి ఉత్పత్తిని పెంచడానికి TSH ఎక్కువగా విడుదల అవుతుంది. అందుకే హైపో థైరాయిడ్‌లో, T3, T4 తక్కువగా, TSH ఎక్కువగా ఉంటుంది. హైపర్ థైరాయిడ్‌లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది.



**మందులు వాడుతున్నా, హైపో థైరాయిడ్ అదుపులో ఉండకపోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు.**

ముఖ్యంగా ట్యాబ్లెట్లు ప్రతి రోజూ క్రమం తప్పకుండా వేసుకోవాలి. మధ్యలో కొద్ది రోజులు మానేసినా, దాని ప్రభావం TSH స్థాయి మీద ఆరు వారాల వరకు ఉంటుంది. ప్రతి రోజూ ఉదయాన్నే థైరాయిడ్ టాబ్లెట్ వేసుకున్నాక, కనీసం అర్ధ గంట వరకు ఎటువంటి ఆహారం తీసుకోకూడదు. పాలు, టీ, కాఫీ కూడా తాగకూడదు. అవేవి తీసుకున్నా, టాబ్లెట్ పూర్తిగా ఒంట పట్టదు. దాని ప్రభావం సంపూర్ణంగా ఉండదు. థైరాయిడ్ ఒక హార్మోన్ అవ్వడం వల్ల, ఆ టాబ్లెట్ చేతితో తాకినా కూడా దాని ప్రభావం తగ్గిపోయే అవకాశం ఉంది. అదీ తడి చేతితో తాకితే, ఆ టాబ్లెట్ ప్రభావం ఇంకా ఎక్కువ తగ్గిపోతుంది. కాబట్టి, ఉదయం మొహం కడుక్కున్న వెంటనే టాబ్లెట్ వేసుకునే తొందరలో, తడి చేతితో టాబ్లెట్ తాకకూడదు.

అలాగే థైరాయిడ్ టాబ్లెట్ వేసుకున్నాక ఇతర టాబ్లెట్స్ వేసుకోవడం వల్ల కూడా, దాని ప్రభావం తగ్గిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఖాళీ కడుపున వేసుకునే అసిడిటీ/ గ్యాస్ టాబ్లెట్, లేక రక్తం పెరగడానికి వేసుకునే ఐరన్ టాబ్లెట్.. థైరాయిడ్ టాబ్లెట్లకు ఎండ తగలడం వలన కూడా వాటి ప్రభావం తగ్గిపోగలదు. కాబట్టి వాటిని ఎండ తగలని స్థలంలో పెట్టుకోవాలి. థైరాయిడ్ నార్మల్ కావడం లేదుని, డోస్ పెంచే ముందు ఇవన్నీ కారణాలు దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇవేవీ కారణాలు లేకపోయినా, థైరాయిడ్ స్థాయి సాధారణానికి రాలేదు అంటే, అప్పుడు కచ్చితంగా వైద్యులను సంప్రదించి టాబ్లెట్ డోస్ పెంచుకోవాలి. హైపో థైరాయిడ్ సమస్యకు మందులు వాడుతున్న వారు, గర్భం దాల్చినప్పుడు, టాబ్లెట్ డోస్ పెంచాల్సి వస్తుంది.

**మతిమరుపు**

జ్ఞాపకశక్తి తగ్గటం, ఏకాగ్రత కుదరకపోవటం, నిర్ణయాలు సరిగా తీసుకోలేకపోవటమూ హైపోథైరాయిడిజమ్ లక్షణాలు కావొచ్చు.ఎందుకంటే మెదడు పనితీరు, విషయగ్రహణ, మానసిక స్థితి తీరుతెన్నుల్లో థైరాయిడ్ హార్మోన్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి తగ్గిపోతే వీటి పనితీరూ మారిపోతుంది.

**కొలెస్ట్రాల్ పెరగటం**

కొన్నిసార్లు వృద్ధుల్లో ఇదొక్కటే హైపోథైరాయిడిజమ్ లక్షణం కావొచ్చు. థైరాయిడ్ హార్మోన్లు పడిపోయినప్పుడు శరీరం కొలెస్ట్రాల్ను విడగొట్టలేదు. చెడ్డ కొలెస్ట్రాల్ను తొలగించలేదు. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు పెరిగిపోతాయి.

**హైపర్ థైరాయిడిజం యొక్క ట్రీట్మెంట్..**

హైపర్‌థైరాయిడిజం ఉన్న వారందరికీ ఈ హార్మోన్ అవసరమైనదానికన్నా ఎక్కువ విడుదల అవుతున్నందుకు మెడికల్ మ్యానేజ్మెంట్ అవసరమవుతుంది. సుమారుగా 40% పేషెంట్స్ కేవలం మెడికల్ ట్రీట్మెంట్ ద్వారానే 18 – 24 నెలల లోపు పూర్తిగా క్యూర్ అవుతారు. ఇలా క్యూర్ కాని వారికి డెఫినిటివ్ ట్రీట్మెంట్ అవసరం పడుతుంది. అంటే, రేడియో అబ్లేషన్ కానీ సర్జరీ కానీ అవసరం పడుతుంది.

*** నిర్లక్ష్యం చేయకూడదు...**

థైరాయిడ్ గ్రంథిలో వాపు ఉన్నప్పుడు, సంబంధిత రక్త పరీక్ష సాధారణంగా ఉన్నంత మాత్రాన ఎలాంటి సమస్య లేదు అని అనుకోవడానికి లేదు.రక్త పరీక్ష బాగుండి, గొంతు ముందు భాగంలో గడ్డ లాగా, లేక వాపు లాగా ఉంటే, నిర్లక్ష్యం చేయకూడదు.

అది కొన్నిసార్లు థైరాయిడ్ క్యాన్సర్ లక్షణం అయివుండవచ్చు. కాబట్టి, వెంటనే గొంతు స్కాన్ చేయించడం, అవసరమైతే ఆ వాపు నుండి సూది ద్వారా ముక్క తీసి (FNAC) పరీక్ష చేయడం మంచిది.

థైరాయిడ్ క్యాన్సర్ చాలా రకాలుగా ఉంటుంది. త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే, పూర్తి సాధారణ జీవితం గడిపే అవకాశం ఉండవచ్చు. అదే ఆలస్యం జరిగితే పరిస్థితి చేయి జారే ప్రమాదం ఉంది.

**ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. సమస్యను సరిగ్గా గుర్తించి, సరైన మందును, సరైన మోతాదులో వాడుతూ, ప్రతి ఆరు నెలలకు ఒక సారి పరీక్ష చేసుకుంటూ, వైద్యుల పర్యవేక్షణలో ఉండడం అనేది థైరాయిడ్ లాంటి దీర్ఘకాలిక జబ్బుల విషయంలో చాలా ముఖ్యం..**

**డా.కౌశల్ గోవర్ధన**
ఏం.బి.బి.ఎస్,
(ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్,
డా.ధనుంజయ హాస్పిటల్,
హైదరాబాద్
7702417779



# వరంగల్–కరీంనగర్ పెంటాసిటీ..

## హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించే వ్యూహం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే కొన్ని నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. అధికారం చేపట్టిన వెంటనే మురికి కూపంగా మారిన మూసీని ప్రక్షాళన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నా.. నిదానంగా ముందుకు సాగుతున్నారు. ఇక వర్షాకాలంలో చిన్న వర్షానికి కూడా హైదరాబాద్ ముంపునకు ప్రధాన చెరువుల ఆక్రమణలే అని గుర్తించారు. దీంతో చెరువులను చెర విడిపించేందుకు కబ్జాలకు చెక్ పెట్టేందుకు హైడ్రా ఏర్పాటుచేశారు. ఇక తర్వాత హైదరాబాద్‌ను మరింత విస్తరించేందుకు ఫ్యూచర్ సిటీకి ప్లాన్ చేశారు. ఈమేరకు కొత్త సిటీకి శంకుస్థాపన కూడా చేశారు. పనులు జరుగుతున్నాయి. ఇక ఇప్పుడు హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించే వ్యూహంలో భాగంగా పెంటా సిటీ ప్లాన్ చేస్తున్నారు.

**కరీంనగర్‌లో కీలక ప్రకటన..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ పర్యటనలో వరంగల్, కరీంనగర్‌ను జంట నగరాలుగా అభివృద్ధి చేస్తూ పెంటాసిటీ కారిడార్‌ను ప్రకటించారు.




హైదరాబాద్‌పై రద్దీ, కాలుష్యం తగ్గించి ఉపాధి అవకాశాలను వికేంద్రీకరించే లక్ష్యంతో ఈ సంకల్పం. వరంగల్, హన్మకొండ, కాజీపేట త్రినగరులకు హుజూరాబాద్ మధ్యస్థంగా కలిపి 60–70 మండలాల విస్తృత అర్బన్ బెల్ట్‌గా మార్చే ప్రణాళిక ఇది.

**ముఖ్య ప్రాజెక్టులు..**

రెండు నగరాల వెలుపల రింగ్ రోడ్లను అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను వేగవంతం చేస్తారు. మధ్యలో బయో–వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటుతో మున్సిపల్ వ్యర్థాలను విద్యుత్‌గా మార్చి పర్యావరణ హితం చేస్తారు. ఐటీ హబ్, ఇతర ఉపాధి కేంద్రాల స్థాపనతో గ్రామీణ ప్రాంతాలకు ఉద్యోగాలు చేరువ చేస్తారు.

**ఆర్థిక విభజన..**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మూడు భాగాలుగా విభజించిన ముఖ్యమంత్రి CURE(హైదరాబాద్ లోపల నెట్ జీరో సర్వీసెస్), PURE (ఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య తయారీ రంగాలు), RARE (వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు). ఈ పెంటాసిటీ ప్రాజెక్ట్ ఉత్తర తెలంగాణకు మరో హైదరాబాద్‌లా మార్చి సమతుల్య ప్రగతి సాధిస్తుంది.

**ప్రధాన ప్రయోజనాలు ఇవీ..**

పెంటాసిటీ మూలంగా హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమలు, జనాభా వికేంద్రీకరణ జరుగుతంది. దీంతో రద్దీ, కాలుష్యం నియంత్రణ సాధ్యమవుతుంది. వరంగల్ విద్యా కేంద్రం (ఎన్ఐటీ, కాకతీయ యూనివర్సిటీ), కరీంనగర్‌తో ఐటీ–మేకింగ్ లింకేజ్‌లు జరుగుతాయి. మామునూరు ఎయిర్‌పోర్ట్ పూర్తి, స్కిల్ సెంటర్లు, రవాణా నెట్‌వర్క్ మెరుగులతో పెట్టుబడుల ఆకర్షణతో మౌలిక వసతుల విస్తరణ జరుగుతుంది. హైదరాబాద్‌కు యువత వలసలు తగ్గి, టౌన్‌షిప్‌లు, మాల్స్, ఆసుపత్రులతో పరోక్ష ఉద్యోగాలు పెరుగుతాయి. భూ విలువల పెరుగుదల, వ్యాపార కేంద్రాలు విస్తరిస్తాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు

ఇంగ్లండ్
ఆధునిక టీ20 ఆటకు నిర్వచనం ఇంగ్లండ్ జట్టే.
ఆల్‌రౌండర్ల బలం మ్యాచ్‌ను తిప్పేస్తుంది.




# 30 ఏళ్లుగా ఇంటి స్థలంలేని దళిత కుటుంబాలు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో నివసిస్తున్న డక్కలి వర్గానికి చెందిన దళిత కుటుంబాలు గత 30 ఏళ్లుగా ఇంటి స్థలం లేక గుడిసెల్లోనే జీవనం కొనసాగిస్తున్నాయి. వర్షాకాలం వస్తే వారి పరిస్థితి వర్ణనాతీతంగా మారుతోంది. చిన్నపాటి వర్షానికే గుడిసెల్లో నీరు చేరి, రాత్రివేళ నిద్ర కూడా సాధ్యం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ నాయకులు వచ్చి ఓట్ల కోసం ఇంటి స్థలాలు ఇస్తామని హామీలు ఇస్తున్నారని, ఎన్నికలు పూర్తయ్యాక మాత్రం తమను పట్టించుకునే నాథుడు కరువయ్యాడని డక్కలి మిథున్‌కుమార్ వాపోతున్నారు. సుమారు 30 మంది జనాభా గల ఈ సామాజిక వర్గానికి ఇప్పటివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు గానీ, ఇంటి స్థలాలు గానీ మంజూరు కాలేదని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా



ఫలితం లేకపోవడంతో నిరాశకు గురవుతున్నామని, జిల్లా కలెక్టర్‌ను కూడా కలిసి మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ ముద్దమల్లప్ప కుటుంబానికి సంబంధించిన స్థలంలో, శైలజ థియేటర్ పక్కన గుడిసెలు వేసుకొని వీరు నివసిస్తున్నారు. ఈసారి అయినా స్పీకర్ ప్రసాద్‌కుమార్ కనికరించి తమకు ఇంటి స్థలాలు లేదా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దళిత కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

**స్పీకర్ సహకారంతో ఇళ్ల స్థలాలను ఇప్పిస్తాం..**

**ముద్ర వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో 25వ వార్డులో నివసిస్తున్న దళిత వర్గానికి చెందిన వారికి ఇళ్లస్థలాలు ఇప్పించేలా కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి టీ.మల్లేష్ అన్నారు. గత కొన్నేళ్లుగా వారికి ఇళ్ళు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా గడపగడపకు తిరిగి కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజా సమస్యలను తీర్చడంలో పార్టీ ముందుంటుందని, వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా మల్లేష్ సతీమణి నాగలక్ష్మి మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన డక్కలి మిథున్ కుమార్ వారి వర్గాలందరికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి సంఘం నాయకులు మిథున్ కుమార్ రత్నమ్మ యాదమ్మ తదితరులు ఉన్నారు.

# సైబర్ నేరాలకు చెక్

- **9 కేసులు ఛేదించిన పోలీసులు.. 12 మంది అరెస్టు**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 5 వరకు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో తొమ్మిది సైబర్ క్రైమ్ కేసులను విజయవంతంగా ఛేదించి, దేశంలోని పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 12 మంది నిందితులను అరెస్టు చేసినట్లు సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపారు. అరెస్టైన కేసుల్లో ఏడు ట్రేడింగ్ మోసాలకు సంబంధించినవని పేర్కొన్నారు. వీటితో పాటు ట్రేడింగ్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్, మ్యాట్రిమోనీ ఫ్రాడ్ వంటి వివిధ రకాల సైబర్ నేరాలు ఉన్నాయని వెల్లడించారు. బాధితులకు ఊరట కలిగించే విధంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ పరిధిలో 58 కేసుల్లో 406 రిఫండ్ ఆర్డర్లను సాధించి, మొత్తం రూ.1,04,17,082ను బాధితులకు తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. ఇది సైబర్ నేరాలపై కఠిన చర్యలకు నిదర్శనమని డీసీపీ పేర్కొన్నారు. కీలక కేసుల్లో ఒకటిగా రూ.22.80 లక్షల జాబ్ ఫ్రాడ్ కేసును డీసీపీ వివరించారు. ప్రముఖ ఎంఎన్‌సీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి బాధితుడి నుంచి రూ.20,80,007 వసూలు చేసినట్లు తెలిపారు. జాబ్ పోర్టల్ ఉద్యోగిలా నటిస్తూ దరఖాస్తు, ఇంటర్వ్యూ, ప్రాసెసింగ్ ఛార్జీల పేరుతో డబ్బులు తీసుకుని, అనంతరం అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వకుండానే సంబంధం తెంచుకున్నారని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పురుషోత్తం శర్మతో పాటు, సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు సరఫరా చేసిన ఢిల్లీకి చెందిన కుల్దీప్ కుమార్, సునీల్‌లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో సోషల్ మీడియా, జాబ్ పోర్టల్స్ ద్వారా వచ్చే ఆఫర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. ఉద్యోగం లేదా అపాయింట్‌మెంట్ కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు చెల్లించవద్దని, మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఓట్ల లెక్కింపులో తప్పులకు తావులేదు : కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ముద్ర, వనపర్తి :**

మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా నిబంధనల ప్రకారం కౌంటింగ్ జరగాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం వనపర్తి జిల్లా ఐడీఓసి మీటింగ్ హాల్‌లో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుపై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కౌంటింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లుబాటు కాని ఓట్లు అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి ఒకసారి ఏదైనా ఓటును చెల్లని ఓటుగా పరిగణిస్తే, దానిని మళ్లీ పరిగణనలోకి తీసుకోరాదని స్పష్టం చేశారు. అభ్యర్థులు సరైన కారణాలతో లిఖితపూర్వకంగా నోటీసు ఇచ్చినప్పుడు మాత్రమే రీకౌంటింగ్‌పై నిర్ణయం తీసుకోవాలని, దీనిపై తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారిదేనని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో అభ్యర్థి తరపున ఒక్క వ్యక్తికే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో టీఓటీ శ్రీనివాసులు, ఆర్వోలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# 11న విద్యాసంస్థలకు స్థానిక సెలవు

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి జిల్లాలో మున్సిపాలిటీలకు జరగనున్న రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో, పోలింగ్ రోజైన 11న స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదర్శ్ సురభి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సెలవును ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ స్థానిక సెలవు వనపర్తి జిల్లా




పరిధిలో ఎన్నికలు జరగనున్న వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీలకు వర్తిస్తుందని తెలిపారు. పోలింగ్ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలు (పాఠశాలలు, కళాశాలలు) మూసివేయనున్నట్లు వెల్లడించారు. ఓటర్లు ఎలాంటి ఆటంకం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఈ సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు.

# పోలీసులకు 'స్ట్రోక్'పై అవగాహన

- **బాలానగర్ పీఎస్‌లో ప్రత్యేక సదస్సు**

**ముద్ర, బాలానగర్ :**

నిరంతరం ప్రజాసేవలో ఉండే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎన్‌సీ హాస్పిటల్ ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సి. రమేష్ సూచించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ సిబ్బందికి 'స్ట్రోక్ (పక్షవాతం) నివారణా మార్గాలు' అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఎదుర్కొనే మానసిక, శారీరక ఒత్తిడి స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుందని డాక్టర్ రమేష్ తెలిపారు. స్ట్రోక్‌కు ముందుగా కనిపించే ప్రాథమిక లక్షణాలు, మొదటి కొన్ని గంటలు ఎంత కీలకమో, సకాలంలో చికిత్స అందితే ప్రాణాపాయం నుంచి ఎలా తప్పించుకోవచ్చో వివరించారు. క్రమం తప్పని వ్యాయామం, సరైన ఆహారం, తగిన విశ్రాంతి ద్వారా స్ట్రోక్ ముప్పును తగ్గించవచ్చని సూచించారు. ఈసందర్భంగా బాలానగర్ సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడంలో ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, వినోద్ కుమార్, జిన్నోవా బయోఫార్మ ప్రతినిధులు నవీన్, ప్రశాంత్, ఆర్ఎన్‌సీ హాస్పిటల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీల్లో నగదు, వస్త్రాల స్వాధీనం

**ముద్ర, నారాయణపేట :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట పట్టణంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేని నగదు, వస్త్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని యాద్గిరి రోడ్డు ఎర్రగుట్ట ప్రాంతంలో శనివారం చేపట్టిన తనిఖీల్లో రూ.2,89,000 నగదు, అలాగే రూ.1,57,000 విలువైన వస్త్రాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల ప్రకారం నగదు లేదా విలువైన వస్తువులు రవాణా చేసే సమయంలో సంబంధిత పత్రాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. పత్రాలు లేని పక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.



# 'హస్తం'తోనే అభివృద్ధి సాధ్యం

**ముద్ర, నారాయణ పేట :**

పట్టణంలోని 3వ వార్డు అభివృద్ధి హస్తం పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలేమోని పద్మ కృష్ణ అన్నారు. శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 3వ వార్డు పరిధిలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదలకు సన్న బియ్యం, జాబ్ క్యాలెండర్, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని ఓటర్లకు తెలిపారు. వార్డు ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలను వార్డులోని ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు.

# బిజెపితోనే అభివృద్ధి సాధ్యం

- **వార్డుల్లో ముమ్మరంగా ప్రచారం**

**ముద్ర, నారాయణపేట :**

పట్టణంలోని వివిధ వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేశారు. మున్సిపల్ ఎన్నిల్లో బీజేపీని గెలపించాలని కోరారు. బీజేపీతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమని వారన్నారు.







**4 వ వార్డులో..**

నారాయణపేట పట్టణ అభివృద్ధి బిజెపి ద్వారానే సాధ్యమని 4వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి కొండా శ్వేతా సత్య యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వార్డులో సేడం మాజీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్తో కలిసి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. బిజెపిని అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తామన్నారు.

**16వ వార్డులో..**

పట్టణంలోని 16వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారం బిజెపి ద్వారానే సాధ్యమని వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కమలాపూర్ అంబికా శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వార్డు ఓటర్లు ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో బిజెపిని అధికారంలోకి తీసుకువచ్చి వార్డును నెంబర్ వన్ గా అభివృద్ధి చేసుకుందామన్నారు. తప్పనిసరిగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించి ఆదరించాలన్నారు.

**21వ వార్డులో..**

21వ వార్డు ఓటర్లు తప్పనిసరిగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి కమలాపూర్ ప్రభాకర్ ఓటర్లను కోరారు. శనివారం వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి బిజెపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వాడు ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని... ఓటు వేసి ఒక అవకాశం కల్పించాలని కోరారు.

**10వ వార్డులో..**

పదో వార్డులో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని కౌన్సిలర్ అభ్యర్థి సిద్ది విశాలాక్షి వెంకట్ రాములు అన్నారు. సేడం మాజీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, బిజెపి నాయకులు నాగురావు నామాజీ, వార్డు ఇంచార్జ్ జ్యోతి సాయిబన్న ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులో నెలకొన్న సమస్యలను దశలుగా పరిష్కరిస్తానన్నారు. పట్టణంలో జిల్లా ఆసుపత్రి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం ఓటర్లు గమనించి బీజేపీని ఆదరించాలన్నారు. జిల్లా ఆసుపత్రి ఏర్పాటు కోసం బిజెపి చేసిన ఉద్యమాన్ని ప్రజలు గమనించాలన్నారు.

**1వ వార్డులో..**

నారాయణపేట పట్టణంలోని ఒకటో వార్డును నెంబర్ వన్ వార్డుగా తీర్చిదిస్తానని కౌన్సిలర్ అభ్యర్థి సుతారి సత్య రఘుపాల్ అన్నారు. శనివారం ఒకటవ వార్డు పరిధిలో మాజీ కౌన్సిలర్ అనూష చిన్న రఘు తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గతంలో టిఆర్ఎస్ అధికారంలో పట్టణంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. కమలం ద్వారానే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# సింహం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించండి

- **వార్డు కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ భాగ్యలక్ష్మి మల్లేష్**

**ముద్ర, నారాయణ పేట :**

పట్టణంలోని 11వ వార్డు ఓటర్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ భాగ్యలక్ష్మి మల్లేష్ కు కేటాయించిన సింహం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్డులో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి సింహం గుర్తుకి ఓటు వేసి తనను ఆశీర్వదించి ప్రజాసేవ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. వార్డులో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు, అలాగే వార్డులో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు పాటుపడతానన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08-02-2026
www.mudranews.in | @mudranews


టీ-20 వరల్డ్ కప్ లో టాప్ 10 జట్లు

పాకిస్తాన్



అనూహ్య ప్రదర్శనలతో పాకిస్తాన్ ఎప్పుడూ ప్రమాదకరం. పేస్ బౌలింగ్ వీరి ప్రధాన ఆయుధం.

# కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే..

**బీఆర్ఎస్ 4 సీట్లకే పరిమితం కాబోతోంది.. కాంగ్రెస్, ఎంఐఎం కలిసినా 20 సీట్లలోపే..**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠం ఈసారి భారతీయ జనతా పార్టీదేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ లో ప్రజల ఆస్తులకు రక్షణ కవచంగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఇకపై కరీంనగర్ లో ప్రజల జాగాలను కబ్జాలు చేసే నాయకుల భరతం పడతానని హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో కబ్జాలకు పాల్పడిన 9 మంది కార్పొరేటర్లను అరెస్ట్ చేయించి బొక్కలో వేసిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ లో బీఆర్ఎస్ పనైపోయిందని, ఈ ఎన్నికల్లో 4 సీట్లకే పరిమితం కాబోతుందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం కలిసినా 20 సీట్లు దాటబోవని అన్నారు. కేంద్రం నుండి వరదలా నిధులు వస్తున్నాయని, మేయర్ పీఠాన్ని అప్పగిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కరీంనగర్ లోని రాజస్తాన్ చౌరస్తా, లయోలా కాలేజీ, బుట్టి రాజారాం కాలనీల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలోని 16, 19, 20 డివిజన్ల అభ్యర్థులు గిత్త రాజేంద్ర ప్రసాద్, మూల రుక్మిణీ, జాడి బాల్ రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగుల్లో బండి సంజయ్ మాట్లాడారు.

పెద్ద పంచాయతీగా ఉన్న మల్కాపూర్ కరీంనగర్ కార్పొరేషన్ లో కొత్తగా కలిసినా పెద్దగా అభివృద్ధి జరుగ లేదన్నారు. కేంద్ర నిధులతోనే చింతకుంట నుంచి శాతవాహన యూనివర్సిటీ వరకు.. రోడ్డు వేయడంతో పాటు అందమైన డివైడర్లు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటయ్యాయని అన్నారు. అమృత్ 2.0 ద్వారా రూ. 132 కోట్లు వచ్చాయని, మల్కాపూర్ చింతకుంట ఏరియాలో వాటర్ సప్లై చేసి ఈ ప్రాంత రూపు రేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. మల్కాపూర్ కు రూ.11.60 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తానని, ఇందుకు సంబంధించిన నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. చింతకుంటలో కూడా ఆరు రోడ్లు, డ్రైనేజీ కోసం రూ.6.52 కోట్లు సిద్ధంగా ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు..

రేకుర్తి ముఖచిత్రం అభివృద్ధి పరంగా మార్చి చూపించింది కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ నిధులేనని అన్నారు. రేకుర్తి చౌరస్తా నుంచి చింతకుంట చౌరస్తా దాకా యూనివర్సిటీ మీదుగా జాతీయ రహదారి నిధుల నుంచి రోడ్డును వెడల్పు చేసి డివైడర్ పెట్టి సెంట్రల్ లైటింగ్ తో ఈ రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దామని తెలిపారు. శాతవాహన కాలనీలో కొత్త రోడ్లు, లయన్స్ కంటి ఆసుపత్రి రోడ్డును కొత్తగా నిర్మించామన్నారు. రేకుర్తిలో నేషనల్ హెల్త్ మిషన్ నిధుల ద్వారా బస్తి దవాఖానను పేద ప్రజల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. రేకుర్తి నుంచి కొత్తపల్లి వరకు డివైడర్లు పెట్టి స్ట్రీట్ లైట్ తో కొత్తపల్లి వరకు సరికొత్త మార్గాన్ని నిర్మిస్తామని, రేకుర్తిలో ఇటీవల కొత్తగా రెండు రోడ్లకు రూ. 1. 94 కోట్లతో నిధులు మంజూరు చేసామని, ఎన్నికలు పూర్తవగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# రాష్ట్రంలో 100% మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలుస్తాం

**- అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు పాజిటివ్ గా ఉన్నారు**
**- మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది నామమాత్రపు నిధులు**
**- పట్టణీకరణ కోసం ప్రత్యేక నిధులు: మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి**

**ముద్ర, మెట్ పల్లి:**
మున్సిపల్ ఎన్నికల్లో వందకు వంద శాతం మున్సిపాలిటీలను, కార్పరేషన్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని మంత్రి ఉత్త కుమార్ రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్ పల్లి మున్సిపాలిటీల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు పాజిటివ్ గా ఉన్నారని అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో 100 శాతం మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని తెలిపారు. తన రాజకీయ అనుభవంలో అధికార పార్టీకి లోకల్ బాడీ ఎన్నికల్లో ఇలాంటి పాజిటివ్ ఉండడం అరుదు అని అన్నారు.



మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బిజెపికి చెప్పుకోవడానికి ఏమీ లేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్ల రూపాయలు వెచ్చి స్తామని మంత్రి హామీ ఇచ్చారు. మున్సి పల్ ఎన్నికల్లో రెబల్స్ పోటీ పై మంత్రి స్పందించారు. రెబల్స్ పోటీలో ఉన్నా కాంగ్రెస్ పార్టీ విజయానికి వచ్చే ఇబ్బంది ఏమీ లేదని మంత్రి స్పష్టం చేశారు. మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తుందని బిజెపి చేస్తున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## విద్యార్థుల్లో జాతీయ సమగ్రత పెంపొందించడానికి 'ప్రేరణ'

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ముద్ర, ఆదిలాబాద్:**
విద్యార్థుల్లో జాతీయ సమగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా 'ప్రేరణ' ఉత్సవం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం స్థానిక కేంద్రీయ విద్యాలయం ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి 'ప్రేరణ ఉత్సవ్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, వారిని ఉన్నత లక్ష్యాల దిశగా ప్రోత్సహించేందుకు 'ప్రేరణ' ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల బోథ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో బాలికల కోసం మూడు రోజుల పాటు జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలను 'ప్రేరణ' పేరుతో విజయవంతంగా నిర్వహించినట్లు గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, నాటికలు, డ్రాయింగ్, పెయింటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యంగా భారతదేశ దార్శనికత వికసిత్ భారత్– 2047, నేను ప్రేరణకు ఎందుకు ఎంపిక కావాలి?' అనే అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటారని వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఒక బాలుడు, ఒక బాలికను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసి గుజరాత్‌లోని వాద్ నగర్ పంపనున్నట్లు తెలిపారు. అక్కడ గుజరాత్ సంస్కృతిని తెలుసుకోవడంతో పాటు తెలంగాణ, ఆదిలాబాద్ గొప్పతనాన్ని ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పంచుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రితో లేఖల ద్వారా సంభాషించే అరుదైన అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్, క్వాలిటీ కోఆర్డినేటర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పనులు చేసేది ప్రజా ప్రభుత్వమే..

**- బీఆర్ఎస్, బిజెపితో ఏ పని కాదు.. ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పండి..**
**- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**ముద్ర, కరీంనగర్:**
ప్రజలకు పనిచేసేది ప్రజాపాలన ప్రభుత్వమేననీ, బీఆర్ఎస్ బిజెపితో ఏ పని కాదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్లోని రాంనగర్ టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు బ్రిలియంట్ స్కూల్ వద్ద 13, 45, 46, 62 డివిజన్లకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్లో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా అనేక బృహత్తర సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు తో పాటు తాను కాంగ్రెస్ నాయకులం కలిసి కరీంనగర్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కరీంనగర్ అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఆయా డివిజన్లను అత్యద్భుతంగా తయారు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులు, ఆయా డివిజన్ల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాతా శిశు ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

**- కలెక్టర్ అభిలాష అభినవ్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ప్రభుత్వ మాతా, శిశు ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మాతా, శిశు ఆసుపత్రిని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్ పేషంట్, ఔట్‌పేషంట్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, రక్తపరీక్షల గది, స్కానింగ్ కేంద్రం, టీకాల గది, చిన్నారులకు పాలిచ్చే గది, మందుల గది, మరుగుదొడ్లు తదితర విభాగాలను పరిశీలించారు. పలు రిజిస్టర్లను తనిఖీ చేసి, అన్ని విభాగాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అవసరమైన టీకాలు, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నపిల్లల వైద్య విభాగాన్ని పరిశీలించి, నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడంతో పాటు తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలతో మాట్లాడి ఆసుపత్రిలో వైద్య సేవలపై వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో రమేష్, విభాగాధిపతి సరోజ, ప్రోగ్రాం ఆఫీసర్ సౌమ్య, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, తహసిల్దార్ రాజు, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తోనే నగర అభివృద్ధి సాధ్యం

**- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**ముద్ర, కరీంనగర్:**
బీఆర్ఎస్ తోనే కరీంనగర్ పట్టణ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ లోని 62వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కలకొండ జ్యోత్స్నతో పాటు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీ తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అని అన్నారు. స్మార్ట్ సిటీ తీసుకువచ్చిన అని చెప్పుకునే బీజేపి ఎంపీ బండి సంజయ్. గతంలో బీజేపి ఉన్న డివిజన్ లలో ఎందుకు రోడ్లను వేసుకోలేదని ప్రశ్నించారు. రెండున్నర సంవత్సరాలలో రెండు రూపాయల బిళ్ల కేంద్రం నుంచి తీసుకువచ్చిన జీవో చూపించినా ముల్లేమూట సర్దుకుని పోతా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కి సవాల్ విసిరారు. 2016లో బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడి మేరకు స్మార్ట్ సిటీ తీసుకువచ్చి 2016 నుండి 2019 వరకు నగర రోడ్లన్నీ అభివృద్ధి చేశామని తెలిపారు. సంజయ్ ఎంపీగా గెలవక ముందే నగరాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి చేశామన్నారు. రెండున్నర సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం నిధులతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కంప్లీట్ చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీ దేనిని అన్నారు. నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఆర్వోఆర్ ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారో సమాధానం చెప్పాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.

అనంతరం 30 డివిజన్ కు చేరుకున్న ఎమ్మెల్యే గంగుల డివిజన్ అభ్యర్థి నక్క పద్మ– కృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, ఆయా డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటే...

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముద్ర, కరీంనగర్:**
రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకటై కుమ్మకు రాజకీయాలు చేస్తున్నాయని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి కోలగాని అనిల్ తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం 54, 30, 31, 32, 33వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున నాకా చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ లో గెలిచిన కార్పొరేటర్లు కు ఇందిరమ్మ ఇళ్లు అర్హులను గుర్తించి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



కరీంనగర్ లో బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని మంత్రి ఓటర్లను కోరారు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# ప్రజారోగ్య సేవలను మరింత మెరుగుపరచాలి

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**ముద్ర, కరీంనగర్:**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజా ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వివిధ సామాజిక ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమకూర్చిన అధునాతన పరికరాలను ఉపయోగిస్తూ రోగులకు మరింత విస్తృత సేవ అందించాలని అన్నారు. ఆస్పత్రుల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత మందుల వివరాల బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గైనకాలజీ, పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో గర్భిణీలు, శిశువులకు సేవలు అందించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. శుక్రవారం సభలకు వైద్యాధికారులు హాజరై ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు లభించే ఉచిత పరీక్షలు, మందులు, చికిత్స పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.




ఆస్పత్రులకు అత్యవసరంగా కావలసిన ఇతర పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో రోగుల అటెండర్లు కూర్చునేందుకు బెంచీలు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వయసును బట్టి చిన్నారులకు, శిశువులకు ఇవ్వాల్సిన అన్ని రకాల టీకాలను సమయం ప్రకారం ఇవ్వాలని ఆదేశించారు. టీకాల సమయం విషయంలో తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇమ్యునైజేషన్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీబీ పరీక్షల సంఖ్య పెంచి జబ్బు ఉన్నవారిని గుర్తించాలని, మందులు అందజేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి సనా, జి.జి.హెచ్ ఆర్.ఎం.ఓ నవీన ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు**

న్యూజిలాండ్
క్రమశిక్షణ, టీమ్‌వర్క్‌కు న్యూజిలాండ్ పేరుగాంచింది. పెద్ద టోర్నీల్లో నిలకడగా ఆడే జట్టు.






# చైర్మన్ పీఠం మాదే..

- **మాజీ ఎమ్మెల్యే చల్లా విశ్వాసం**

**ముద్ర, పరకాల:**

పరకాల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే అత్యధిక స్థానాలు గెలుచుకొని చైర్మన్ స్థానాన్ని దక్కించుకుంటామన్న విశ్వాసాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వ్యక్తం చేశారు. శనివారం 7, 9వ వార్డు అభ్యర్థుల బండారి కవిత కృష్ణ, దుంపేటి నాగరాజుతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో పట్టణంలో చేసిన అభివృద్ధి పనులు మూలంగా ప్రజలు టిఆర్ఎస్ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. బండారి కవిత కృష్ణ పరకాల మున్సిపాలిటీలో కౌన్సిల్ గా పనిచేసిన అనుభవం ఉందని ఆ అనుభవంతో ఎక్కువ నిధులను 9వ వార్డు అభివృద్ధి కోసం తీసుకువచ్చి ప్రజల మెప్పు పొందే విధంగా పనిచేస్తాడని అందుకుగాను వార్డు ప్రజలు గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

# మరోసారి అవకాశం ఇవ్వండి..

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

మరోసారి అవకాశం ఇవ్వండి వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని 17వ వార్డు బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి చెన్న స్వాతి మహేష్ వార్డు ప్రజలను కోరారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె తన మద్దతుదారులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్



నాయకురాలు సిద్దుల పద్మ, చెన్న మహేష్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయలో పడకండి..

- **మాజీ ఎమ్మెల్యే చల్లా, మధుసూదనా చారి**

**ముద్ర, పరకాల:**



దేశంలోనే తెలంగాణ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిపోయిందని తెలంగాణ మాజీ శాసనసభ అధిపతి శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పరకాల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తో కలిసి మాట్లాడారు. తెలంగాణ కంటే వందల ఏళ్లు ముందుగా ఏర్పడిన రాష్ట్రాలు తెలంగాణ మోడల్ అభివృద్ధి చెందలేదని ఆయన తెలిపారు. తెలంగాణలోని ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి గత ప్రభుత్వ హయాంలో లబ్ధి చేకూరిందని ఆయన అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్నప్పుడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అభివృద్ధిని మేధావులు యువకులు అంచనా వేయాలన్నారు. తెలంగాణలోని మౌలిక వసతుల్లో ఎంతో మెరుగు దల కనిపించిందని మధుసూదనాచారి తెలిపారు. కాంగ్రెస్ మాయలో పడవద్దని ప్రజలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లధ ధర్మారెడ్డి కోరారు. పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 9న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ పరకాల కు వస్తున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# బీజేపీతోనే దేశానికి మేలు

**ముద్ర, పరకాల**

బిజెపి అభ్యర్థులను గెలిపింస్తేనే ప్రతీ ఇంటికి మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న వార్డు ప్రజలను కోరారు. శనివారం 18వ వార్డు అభ్యర్థి పాసాని హేమలత సోమరాజు గెలుపును కోరుతూ.. ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్లాలంటే బీజేపీకే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

# పోస్టల్ బ్యాలెట్ ను సద్వినియోగం చేసుకోవాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్ సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో ఫిబ్రవరి, 8,9 తేదీల్లో మున్సిపాలిటీ పరిధిలో గలభువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీ లలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఏర్పాటు చేశామని, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు కేంద్రాలకు హాజరై తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.

# నిబంధనలు పాటించకుంటే చర్యలు

- **శ్రీరామ ఫర్టిలైజర్ దుకాణం లైసెన్స్ రద్దు**
- **ఏడీఏ రమేష్ బాబు**

**ముద్ర, తుంగతుర్తి:**

తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన శ్రీరామ ఫెర్టిలైజర్ షాపును రద్దు చేసినట్లు తుంగతుర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ బాబు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యూరియా అమ్మకాలను యాప్ ద్వారా బుక్ చేసిన తర్వాత అమ్మాలని నియమాల్నిపెట్టిన అట్టి నియమాలను అతిక్రమించి యాప్ లో బుక్ చేయకుండానే యూరియా అమ్మిన కారణంగా అతని లైసెన్స్ రద్దు చేసినట్లు తెలిపారు. ఏ డీలర్ అయినా కానీ యూరియా యాప్ లో రైతులు బుక్ చేసుకున్న తర్వాతనే తన ఈపాస్ మిషన్ ద్వారా నమోదు చేసి రైతులకు విక్రయించాల్సి ఉంటుందన్నారు. చాలామంది ఈ విధానాన్ని అమలు చేయకపోవడం సరికాదన్నారు. ప్రతి దుకాణం యజమాని రికార్డులను సక్రమంగా మైంటైన్ చేయాలని స్టాక్ రిజిస్టర్ సరిపోయే విధంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పాఠశాలను తరలించ వద్దని వినతి

**ముద్ర, తుంగతుర్తి:**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను వేరే ప్రాంతానికి తరలించొద్దని డిమాండ్ చేస్తూ శనివారం అఖిలపక్షల ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీ సంక్షేమ సంఘం అసిస్టెంట్ సెక్రెటరీ కయీమ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. తుంగతుర్తి ప్రాంతంలో సరైన వసతులు లేవనే సాకుతో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలను వేరే ప్రాంతానికి తరలిస్తామంటే ఊరుకునేలేదని హెచ్చరించారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మరియు స్థానిక ఎమ్మెల్యే స్పందించి పాఠశాలకు నూతన ప్రభుత్వ భవనాన్ని మంజూరు చేయాలని సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మల్లెపాక సాయిబాబా, తడకమళ్ళ రవికుమార్, గొపగాని రమేష్, నారాయణదాసు నాగరాజు, ఉప్పుల నాగమల్లు బొజ్జ సాయికిరణ్, సాయి కృష్ణ , మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.






# సరిత మల్లేష్ ప్రచారం ముమ్మరం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా శనివారం 28వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గుమ్ముల సరిత మల్లేష్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డ్ ఇన్ చార్జ్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ వెల్దుర్తి రఘు, వార్డు అధ్యక్షుడు నర్సిరెడ్డి, హీరేకర్ అమర్ నాథ్, తదితర నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయండి

- **భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో డీ ఆర్డీఓ నాగిరెడ్డి, భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ఆర్డిఓ కృష్ణారెడ్డి, మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో అడిషనల్ డి ఆర్ డి ఓ సురేశ్, పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో తహసిల్దార్ శ్రీనివాస్, కమిషనర్ అంజన్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఆర్డీవో శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా ఓటర్లతో తమ ఓటును డబ్బుకు, మద్యానికి, ఇతరత్రా ప్రలోభాలకు లొంగకుండా వేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఒక మంచి నాయకుడిని ఎన్నుకోవడం వల్ల వార్డు ల అభివృద్ధి లో ముందు ఉంటాయని తెలిపారు.






# భువనగిరి ఖిల్లాపై బీఆర్ఎస్ జెండా ఎగరాలి

- **మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ ఎన్నికలలో భువనగిరి ఖిల్లా పై బిఆర్ఎస్ జెండా ఎగరాలని ఎగరవేయాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఓటర్లను కోరారు. శనివారం పట్టణంలోని 2, 5,17,18 వార్డుల బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకై భారీ ర్యాలీతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ వార్డ్ అభ్యర్థి చింతల కిష్టయ్య, 5వ వార్డు అభ్యర్థి వాకిటి లతా కుమార్, 18 వ వార్డు అభ్యర్థి అందె శంకర్ ల కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలుచుకుంటే భువనగిరి ఖిల్లాపై జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవీ కిరణ్ కుమార్, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మండల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

రైల్వే రంగాన్ని ప్రైవేటీకరణ వ్యతిరేకించాలని రైల్వే రంగం జిల్లా నాయకులు దాసరి పాండు అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్ ముందు రైల్వే రంగాన్ని ప్రైవేటీకరణ చేయడాన్ని ఆపాలని ధర్నా నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పేద మధ్య తరగతి కార్మిక వర్గం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు శక్తులకు సంపదను సృష్టించే ప్రభుత్వ రంగాలు రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికాం లాంటివి అప్ప



జెప్పడానికి చూస్తుందన్నారు. 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ , పట్టణ కన్వీనర్ గంధ మల్ల మాతయ్య, నాయకులు గురువయ్య, ఎల్లేష్, కోటేష్, రత్నం, లక్ష్మీ పాల్గొన్నారు.



# కౌంటింగ్ సెంటర్ పరిశీలన

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి మండలంలో దివ్య బాల స్కూల్ లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ ను జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ హాల్స్ ఏర్పాట్లు, టేబుల్స్ ఏర్పాటు, కౌంటింగ్ సిబ్బంది ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, తాగునీరు, మరుగుదొడ్లు సదుపాయాలు, విద్యుత్ సరఫరా ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామలింగం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వివేకానందను గెలిపించండి

- **సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్న అభ్యర్థిని ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పార్టీ కార్యదర్శి జాన్ వెస్లీ, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి లు విజ్ఞప్తి చేశారు. శనివారం భువనగిరి పట్టణంలో 6వ వార్డు హనుమాన్ వాడ, జగ్గయ్య నగర్ లో సీపీఐ (ఎం) అభ్యర్థి కొలుపుల వివేకానందని గెలిపించాలని కోరుతూ భువనగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికలలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ 2023లో 6 గ్యారంటీ ల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపై అనేక భారాలు మోపుతూ దేశాన్ని రాష్ట్రాన్ని కార్పొరేట్ చేతులకు కట్టబెట్టుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు



దాసరి పాండు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, జిల్లా కార్యదర్శి లౌడియా రాజ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్,రాష్ట్ర రైతు సమన్వయ అధ్యక్షులు కొలుపుల అమరేందర్, పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు,

మాజీ కౌన్సిలర్ తుమ్మల పాండు, బిఆర్ఎస్ పట్టణ నాయకులు ముల్కలపల్లి సత్యనారాయణ, గంటేపాక బిక్షపతి, నీలశ్రీనివాస్, సిపిఎం పట్టణ నాయకులు గద్దె నరసింహ, సంగు నరేందర్, గంధమల్ల మాతయ్య, వనం రాజు తదితరులు పాల్గొన్నారు



# నరసింహ యాదవ్ ను గెలిపించాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని 26వ వార్డులో సింగనబోయిన నరసింహ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్, భువనగిరి జిల్లా అధ్యక్షులు కొత్తపెల్లి ఆనంద్ యాదవ్, మాదరబోయిన నరేష్ యాదవ్, స్టేట్ యూత్ బ్రిగేడ్ మేకల బాలు యాదవ్ లు ఓటర్లను కోరారు. శనివారం యాదవ సంఘం నాయకులతో కలిసి వార్డులో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

# భారీ మెజారిటీతో గెలిపించాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి పట్టణంలోని 32 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూషపాత అందాలను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ ఓటర్లను కోరారు. శనివారం 32వ వార్డు తారక రామ్ నగర్ లో ఇంటింటా ప్రచారంలో చేయి గుర్తు మీద ఓటు వేసి, సీరియల్ నెంబర్ 2పై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు
దక్షిణాఫ్రికా శక్తివంతమైన బ్యాట్స్‌మెన్, ఫాస్ట్ బౌలర్లు వీరిదే బలం. కీలక మ్యాచ్‌ల్లో అదృష్టం కలిసి రావాల్సి ఉంటుంది.





## పోలింగ్ విధులపై పూర్తి అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ పాండు

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 11న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, ముందుగానే నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. సంగారెడ్డి లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణ విధులపై మాస్టర్ ట్రైనర్ చే శనివారం రెండో విడత శిక్షణ తరగతులను నిర్వహించి అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులను సందర్శించిన సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు పీ.ఓ, ఏ.పీ.ఓలకు కీలక సూచనలు చేశారు. హ్యాండ్ బుక్ లో పొందుపర్చిన అంశాలను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధులపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలన్నారు. జిల్లాలో ఎన్నికలు జరగనున్న అన్ని మున్సిపాలిటీలలో శనివారం పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులకు 1298 మంది పి ఓలు, ఏపీఓలు హాజరైనట్లు ఎన్నికల శిక్షణా తరగతుల నోడల్ అధికారి రామాచారి తెలిపారు.

# ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ రాహుల్ రాజ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మున్సిపల్ ఎన్నికలు, ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి శనివారం కలెక్టరేట్ లో కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్ ల కు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేందుకు కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్ లు ప్రతి అంశంపై సంపూర్ణంగా అవగాహన పెంపొందించుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అనుసరించాల్సిన విధానం, లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్స్ ల ద్వారా పోలైన ఓట్ల లెక్కింపు ఏవిధంగా చేపట్టాలో తెలువలన్నారు. కౌంటింగ్ టేబుల్స్, రౌండ్లు వారిగా ఫలితాలు వెల్లడిలో కౌంటింగ్ సూపర్వైజర్లు తిసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏజెంట్లు, అభ్యర్థులతో వ్యవహరించాల్సిన తీరు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎటువంటి సందేహం వచ్చినా వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలని తెలిపారు. నాలుగు మున్సిపాలిటీలకు కలిపి 31 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 62 మంది అసిస్టెంట్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13న ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలవుతుందని తెలిపారు. ఈ శిక్షణలో కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన..**

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం పరిశీలించారు. ఓటర్ జాబితా నంబర్, ఓటర్ జాబితాలో సీరియల్ నంబర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు డ్యూటీ ఆర్డర్ తో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు తీసుకు రావాలని సూచించారు.

**కలెక్టరేట్ లో తనిఖీ..**

కలెక్టరేట్ లోని వివిధ శాఖల కార్యాలయాలను కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. ఎన్ఐసీ, డిఆర్డీఓ, సివిల్ సప్లై కార్యాల యాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతూ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఆర్ఓ భుజంగరావు, డిఆర్డీఓ శ్రీనివాసరావు, ఏవో యూనస్, సూపరెంటెండ్ రవీందర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.







## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని పరిశీలించిన మంత్రి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటాలో నిర్మిస్తున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని శనివారం ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తో కలిసి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల చివరిలో గాని వచ్చే నెల మొదటి వారంలో గాని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు పరిశీలించామన్నారు. చిన్న చిన్న పనులు, క్లీనింగ్ తప్ప దాదాపు పనులు పూర్తయినట్లు తెలిపారు. నాలుగు మెగావాట్ల కెపాసిటీ గల ఆయిల్ ఫామ్ పిప్పితో కూడిన వ్యర్థాలతో విద్యుత్ జనరేషన్ చేసే ప్లాంట్ కూడా పూర్తవుతుందన్నారు. పనులు మొత్తం పూర్తిగా గానే ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ముఖ్యమంత్రి సమయం కోరుతనన్నారు. ఫ్యాక్టరీ లోనే మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తామన్నారు. ఆయిల్ ఫామ్ పంటలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యవసాయ యాంత్రీకరణ, అధునాతన వ్యవసాయ పద్ధతులపై ప్రదర్శన, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 120 మెట్రిక్ టన్నుల వరకు గెలలను ప్రాసెస్ చేసే అవకాశం ఉన్న ఈ ఫ్యాక్టరీ ఉత్తర తెలంగాణ వరప్రదాయంగా మారుతుందన్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన సంతకం పెట్టినని చెప్పారు. ఒకటిన్నర సంవత్సరంలోనే ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఓపెనింగ్ కోసం పనుల పరిశీలనకు వచ్చామన్నారు. ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ ఫామ్ తోటను స్పూర్తిగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆయిల్ ఫామ్ పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్ భాష, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఆయిల్ ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**





సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సైబర్ నేరాల నుంచి ప్రజలను రక్షించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ, సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో "సైబర్ జాగృత దివాస్", ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో ఆన్‌లైన్ మోసాలు అతిపెద్ద సమస్యగా మారాయన్నారు. గడిచిన సంవత్సర కాలంలో సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1050 సైబర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన రూ. 35.72 కోట్లలో నుంచి రూ. 7.36 కోట్లను హోల్డ్ చేసి, తిరిగి బాధితులకు అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

అమాయక ప్రజల బలహీనతే, సైబర్ నేరాగాళ్ల బలంగా వివిధ రకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ను వినియోగించి కొత్త పద్ధతుల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని అనవసర లింక్ లను ఓపెన్ చేసి, ఇబ్బందులకు గురి కావొద్దని అన్నారు.

ఈజీ మనికి అలవాటు పడి, అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పన్నిన వలలో పడవద్దన్నారు. సైబర్ నేరాలకు గురిఅవుతున్న వారిలో విద్యావంతులే అధికం అన్నారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్, నకిలీ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల, డిజిటల్ అరెస్ట్ వంటి ఆన్లైన్ మోసాల పట్ల అవగాహ కలిగి ఉండాలన్నారు. మొదట డబ్బులు వస్తున్నట్లు ఆశ చూపించి, ఆతర్వాత ఆన్ లైన్ మోసాలకు పాల్పడతారని గుర్తించాలన్నారు.

డిజిటల్ అరెస్ట్ అంటే ఎవ్వరూ బయపడాల్సిన అవ్యయం లేదన్నారు. అసలు డిజిటల్ అరెస్ట్ ఉండదన్నారు. ఆన్లైన్ లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, తెలియని లింక్స్, apk ఫిల్స్ ఓపెన్ చేసి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయినట్లైతే వెంటనే (గోల్డెన్ అవర్)/48 గంటలలోపు 1930 కు కాల్ చేసి గాని, యన్.సి.ఆర్.బి. (https://www.cybercrime.gov.in) పోర్టల్ నందు కాంప్లయింట్ నమోదు చేయాలని ఎస్పీ సూచించారు.

## టెక్నాలజీ వైపు అడుగులు వేయాలి

- టెక్నాలజీ వైపు అడుగులు వేయాలి
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**



మహిళలు నూతన టెక్నాలజీ వైపు అడుగులు వేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. శనివారం ఆయన అందోల్ జోగిపేట మున్సిపాలిటీ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి, మహిళలకు వడ్డీలేని రుణాలు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి చేస్తున్న కృషి ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ప్రయోజకురాలు అయితే కుటుంబం బాగుపడుతుందని పేర్కొన్నారు. పాత తరం నుంచి కొత్త తరం టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. స్కిల్స్ పెంపొందించుకొని ఉపాధి వైపు అడుగులు వేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలు ఇతర అభివృద్ధి పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలోని ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేస్తానని మహిళలకు హామి ఇచ్చారు. జోగిపేట పట్టణం అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు అజ్జమర్రి బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనితో నర్సాపూర్ ప్రాంత వాసులకు జోగిపేటకు రవాణా సదుపాయం పెరుగుతుందన్నారు. నర్సింగ్ కాలేజి, మున్సిపల్ భవనం, వంటివి రూ.240 కోట్లతో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. గతంలో కూడా ఈ ప్రాంతానికి 50వేల ఎకరాలు సింగూర్ నీరు, జేఎన్టీయూ కాలేజి వంటివి అభివృద్ధి చేఉసినట్లు గుర్తుచేశారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీ ని విద్య , వైద్య కేంద్రాల హబ్ గా అభివృద్ధి చేస్తున్నామన్నారు . జోగిపేట లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అన్ని వార్డులలో భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, డాకూరి వెంకటేశం, కృష్ణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, డాకూరి శివశంకర్, కోరబోయిన నాగరాజు. మల్లయ్య, రంగం సురేష్, చిట్యాల మధు, కుమ్మరి భాస్కర్, అశోక్, క్రిష్ణ, 12వ వార్డు అభ్యర్థి కోరబోయిన సరస్వతి, 13వ వార్డు అభ్యర్థి డాకూరి శివశంకర్, 14వ వార్డు అభ్యర్థి చంద్రకళ, 16వ వార్డు అభ్యర్థి పట్లోళ్ల శ్రీనివాస్, 15వ వార్డు అభ్యర్థి సత్యనారాయణ, అల్లే శ్రీకాంత్, అల్లె యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యంలోనే పట్టణాలు బాగు

- ఎమ్మెల్యే రోహిత్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఇందిరమ్మ రాజ్యంలోనే పల్లెలు, పట్టణాలు బాగుచేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని 5, 7, 10, 27 వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు మర్చిపోలేదన్నారు. మెదక్ పట్టణం అభివృద్ధి చెందాలంటే అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రచారంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు సుభాష్ చంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రచారంలోనే అభ్యర్థి బర్త్ డే..**

6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి రాగి అశోక్ బర్త్ డే ఉండడంతో ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు కేక్ కట్ చేయించి సంబరాలు చేశారు. ప్రజల ఆశీస్సులతో గెలుపొంది వార్డు అభివృద్ధి చేయాలని సూచించారు.

## రేపు ప్రజావాణి రద్దు

- కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**



కలెక్టరేట్ లో ఈ నెల 9న నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు మున్సిపల్ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున, సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

**11న పబ్లిక్ హాలిడే..**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు జిల్లాలో ఎన్నికలు నిర్వహించనున్న మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 11న ప్రభుత్వ సెలవుగా ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరగనున్న సంగారెడ్డి, సదాశివపేట, కోహీర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్-జోగిపేట, ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపాలిటీల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలు, వ్యాపార సంస్థలకు పబ్లిక్ హాలిడే వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు జరగనున్న సంబంధిత మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు వ్యాపార సంస్థల (ఫర్మ్‌లు)లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 ప్రకారం వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని సంబంధిత యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

# కాంగ్రెస్ మాటలు నీటి మూటలు

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**





కాంగ్రెస్ హామీలు నీటి మూటలు అయ్యాయని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం.పద్మాదేవేందర్ రెడ్డి ఆరోపించారు. మెదక్ పట్టణంలోని 24, 31, 26,27, 28, 15, 30 వార్డుల్లో శనివారం బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు అంకం చంద్రకళ, (ఆర్కే) రామగిరి శ్రీనివాస్, మ్యాదరి దీపక్ కుమార్, అస్తరిగళ్ల పల్లె రాణి బాలరాజ్, బండి పూజ నరేష్, ఆరేళ్ళ గాయత్రి మల్లిఖార్జున్ గౌడ్, నింగమైల కిరణ్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ కు ఓటేసి మరోసారి మోసపోవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ సహకారంతో మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన మెదక్ జిల్లా కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, రోడ్ల విస్తరణ తోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. .

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆసరా పెన్షన్లు, రైతులకు సంపూర్ణ రుణమాఫీ, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామన్న హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు. మల్కాజిగిరి గుండాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ కోరుకునేది లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఓటు కోసం వస్తే హామీల అమలుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
08.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు**

వెస్టిండీస్
టీ20 ఫార్మాట్‌కు కేరాఫ్ అడ్రస్
వెస్టిండీస్.
సిక్సర్ల వర్షంతో మ్యాచ్‌ను
క్షణాల్లో మార్చగలరు.




# బ్యాక్ డోర్ లో బ్యాక్ లాగ్ పోస్టులు

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ముద్ర, తెలంగాణ న్యూస్ :**

కాంగ్రెస్ పాలనలో బ్యాక్ డోర్ లో బ్యాక్ లాగ్ పోస్టుల రిక్రూట్ మెంట్ జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆమె ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల్లో భారీగా ఉద్యోగాల సర్కార్ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఒక్కో ఉద్యోగానికి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారని నిరుద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో దొడ్డిదారిన అక్రమ నియామకాలు.. లక్షలాది మంది నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన నిరుద్యోగులు, యువత నోట్లో ప్రభుత్వం మట్టి కొడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుద్యోగ రేటు రోజు రోజుకు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత చిన్న చిన్న ఉద్యోగాలు తప్పితే యువత పరిస్థితి మారలేదన్నారు. దీంతో కాంగ్రెస్ వస్తే న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఓడించారని వివరించారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ వస్తదని అనుకున్నారు.. కానీ అది కూడా ఇవ్వలేదన్నారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉండి అన్యాయం చేసిన నాయకులంతా



# వార్ ఆఫ్ వర్డ్స్ రేవంత్ రెడ్డి వర్సెస్ ఫడ్నవిస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ, మహారాష్ట్రల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, దేవేంద్ర ఫడ్నవీస్ మధ్య వార్ ఆఫ్ వర్డ్స్ కు తెర లేచింది. ఇటీవలే రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఫడ్నవీస్ తాజాగా తప్పుపట్టారు. ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. మొత్తం కాంగ్రెస్ పార్టీ విధానాలనే ఆయన తప్పు పట్టారు. కాంగ్రెస్ వల్లే దేశంలో ఈ దుస్థితి తలెత్తిందంటూ మండిపడ్డారు. తమది సమ్మిళిత విధానమంటూ ఎదురుదాడికి దిగారు. కాంగ్రెస్ కు అటువంటి విధానం లేదని విమర్శించారు. మైనారిటీ రిజర్వేషన్ల విషయంలో ఇటీవలే రేవంత్ రెడ్డి.. బీజేపీకి సవాల్ విసిరారు. తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే ముస్లింలకు అమవుతున్న నాలుగు శాతం రిజర్వేషన్ కోటాను రద్దు చేస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. హైదరాబాద్‌లో జమాతే ఉలామా తెలంగాణ సంప్రదింపుల సమావేశంలో దీని గురించి ప్రస్తావించారు. అలాగే మహబూబ్‌నగర్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నిర్వహించిన సభలో చేసిన వ్యాఖ్యలనూ తిప్పికొట్టారు రేవంత్. దమ్ముంటే తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీకి సవాల్ చేశారు. విద్వేష ప్రసంగాలపై ప్రతిపాదిత చట్టం రూపకల్పనలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి సహాయం కోరారు రేవంత్ రెడ్డి. నితిన్ నబిన్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరో ఢిల్లీ నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చి ఏం మాట్లాడారో తెలంగాణ సమాజం ఆలకించిందని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్ షా ప్రసంగించారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు తాజాగా



దేవేంద్ర ఫడ్నవిస్ స్పందించారు. తెలంగాణలో ప్రవేశపెట్టనున్న కొత్త చట్టంపై చేసిన ప్రకటనలపై ఘాటు విమర్శలను గుప్పించారు. నాగపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ విభజనకు కాంగ్రెస్ పార్టీ కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తోన్న బుజ్జగింపు రాజకీయాల వల్లే దేశం విడిపోయిందని ధ్వజమెత్తారు. దేశ విభజన జరిగి ఇన్ని సంవత్సరాలైనప్పటికీ ఆ పార్టీ నేటికీ ఇదే విధానాన్ని కొనసాగిస్తోందని దేవేంద్ర ఫడ్నవిస్ మండిపడ్డారు. తమ పార్టీ విధానాలు దీనికి పూర్తి విరుద్ధమని దేవేంద్ర ఫడ్నవిస్ స్పష్టం చేశారు. అందరికీ సమ న్యాయం చేయడమే తమ పార్టీ ప్రధాన అజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ మాదిరిగా ఏ ఒక్క వర్గాన్నీ తాము బుజ్జగించబోమని తేల్చి చెప్పారు. ఇలాంటి బుజ్జగింపు రాజకీయాలనేవి తమ విధానం కాదని, అందరినీ సమంగా చూడటమే తమ నినాదమని ఫడ్నవిస్ పేర్కొన్నారు.

# నిబంధనలు అతిక్రమించారు.. చర్యలు తీసుకోండి



- **బీజేపీ, ఎంఐఎం, మాజీ మంత్రి హరీశ్ రావుపై ఎస్ఈసీకి కాంగ్రెస్ లేఖ**
- **సీఎం రేవంత్ పై జాతీయ మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాలు దువ్వుతోన్న రాజకీయ పార్టీలు.. ఒకరిపై మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల తూటాలు పేలుస్తున్నాయి. ప్రచార పర్వం నువ్వా నేనా అన్నట్లుగా సాగుతున్న వేళ బీజేపీ, ఎంఐఎం, మాజీ మంత్రి హరీశ్ రావుపై కాంగ్రెస్ పార్టీ ఎస్ఈసీకి ఫిర్యాదు చేసింది. ఎస్ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘించారంటూ టీ కాంగ్రెస్ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పి.రాజేశ్ కుమార్ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాణి కుముదినికు లేఖ రాశారు. ఈ నెల 4న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మహబూబ్ నగర్ లోని ఎంవీఎస్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్, 6న ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ బోధన్ గ్రౌండ్ లో సభలు నిర్వహించారని చెప్పారు. ఇది రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధం అన్నారు. ఎస్ఈసీ గైడ్ లైన్స్ ప్రకారం విద్యా సంస్థలు, వాటి ప్రాంగణాలను రాజకీయ ప్రచారాలు, సభల కోసం ఉపయోగించరాదనే నిబంధనలు ఉన్న విషయాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. అయినా బహిరంగ సభల నిర్వహణ, ప్రచారానికి రిటర్నింగ్ ఆఫీసర్, ఎన్నికల అధికారులు అనుమతులివ్వడంపై సందేహాలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఎస్ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘించించి అనుమతులు ఇచ్చిన రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎన్నికల అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**డబ్బులు తీసుకుని ఓట్లు వేయమన్నారని..**

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల పటాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్, జిన్నారం మున్సిపాలిటీల్లో పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లఘించిరాని రాజేశ్ కుమార్ ఎస్ ఈ సీకి మరో లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి డబ్బులు తీసుకుని బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని హరీశ్ రావు ఓటర్లను కోరారని ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇది ఓటర్లను లంచం ఇచ్చి ప్రభావితం చేసే ప్రయత్నంగా, ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసే చర్యగా స్పష్టం అవుతుందన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను బహిరంగంగా దిక్కరించడంతో పాటు న్యాయమైన ఓటు హక్కును కూడా దెబ్బతీస్తాయన్నారు. దీంతో ఎంసీసీని ఉల్లంఘించిన ఎన్నికల సమగ్రతను ప్రమాదంలోకి నెట్టిన హరీశ్ రావుపై చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.

**సీఎం వ్యాఖ్యలపై చర్యలు తీసుకోండి..**

ఈ నెల 6న నిజామాబాద్ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల బంధాన్ని అవిభక్త కవలలైన వీణవాణిలతో పోల్చడాన్ని బీజేపీ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ శనివారం రేవంత్ రెడ్డిపై జాతీయ మానవ హక్కుల సంఘం, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. రాజకీయాల కోసం, ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి మానవత్వం మరిచి మాట్లాడుతున్నారని ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు. సీనియర్ పొలిటీషియన్‌గా ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. వీణవాణిల ప్రస్తావన తీసుకురావడం చాలా పెద్ద తప్పు అని అన్నారు. బీజేపీబీఆర్ఎస్‌ది ఫెవీకాల్ బంధం అనే వరకూ ఓకే.. ఇలాంటి విమర్శలు ఆమోదయోగ్యంగానే ఉన్నాయి.. కానీ వీణవాణిల ప్రస్తావన తీసుకురాకుండా ఉండాల్సింది అని అర్వింద్ పేర్కొన్నారు.



# బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలి

- **బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న వారికి టిక్కెట్లు**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**ముద్ర న్యూస్ మేడ్చల్:**

మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గవర్నర్ దగ్గరకు బిల్లు పంపితే ఆమోదించకుండా బీజేపీ అడ్డుకుందన్న ఆయన బీజేపీ, బీఆర్ఎస్ ఫెవీకాల్ బంధం ఏకం అయి బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్నాయని ఆరోపించారు. బీసీల నోటి కాడ బువ్వను లాక్కున్న వీరిద్దరికి బడుగు, బలహీన వర్గాలు బుద్ధి చెప్పాలన్నారు. ఆయా పార్టీలను మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కోరారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవాపురం (పదో వార్డు) నుంచి



మాధవరెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న ఆయన్ను బీఆర్ఎస్ నాయకత్వం పెంచి పోషిస్తోందని ఆరోపించారు. మాధవరెడ్డి వెనుక బీఆర్ఎస్, కల్వకుంట్ల కుటుంబం ఉందని పేర్కొన్నారు.

కేసీఆర్, మాధవరెడ్డి వెనుక ఉండి బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కోర్టులో కేసులు వేయించారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు అమలు అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతో కుట్ర చేశారని మండిపడ్డారు.

# కశ్మీర్ భారత్‌దే.. పాక్‌కు ట్రంప్ షాక్..!

**ముద్ర, హైదరాబాద్ :**

అగ్ర రాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ ఏడాది కాలంగా భారత్‌పై విద్వేషం వెళ్లగక్కారు. తన వ్యక్తిగత అవసరాల కోసం పాకిస్తాన్‌తో దోస్తీ చేసి.. భారత్‌పై, ప్రధాని నరేంద్రమోదీపై విమర్శలు చేశారు. భారత ఎగుమతులపై 50 శాతం ప్రతీకార సుంకాలు విధించారు. దీంతో పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా భారత్‌పై రెచ్చిపోయారు. ఇక టారిఫ్‌ల ప్రభావంతో దీంతో భారత్‌లోని ఫార్మసీ, అపరెల్స్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడింది. అయితే ట్రంప్ టారిఫ్‌లపై, వ్యాఖ్యలపై మోదీ మౌనం వహించారు. తన చాణ్యంతో ఆస్ట్రేలియా, యూకే, యూఏఈ, దుబాయ్, దక్షిణాఫ్రికాతోపాటు యూఏఈతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో ట్రంప్ దిమ్మ తిరిగింది. వెంటనే భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ముందుకు వచ్చారు. మధ్యంతర ఒప్పందం కుదిరింది కూడా. ఇక పాకిస్తాన్‌తో దోస్తీ తప్పని అర్థం చేసుకున్నారు. దీంతో పాకిస్తాన్‌కు షాక్ ఇచ్చేలా ఓ పోస్టు పెట్టారు.

**స్పష్టమైన సందేశం..**

భారతఅమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. తర్వాత కొన్ని గంటల్లోనే అమెరికా అధికారిక 'X' ఖాతాలో భారత మ్యాప్ పోస్ట్ చేసింది. ఈ మ్యాప్‌లో జమ్మూకశ్మీర్, లడఖ్, పీవోకే(పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్) అన్నీ భారత భూభాగంగా చూపారు. ఇది



భారత సరిహద్దులకు అమెరికా అంగీకారాన్ని సూచిస్తుంది.

**పాక్ వాదనకు తీవ్ర దెబ్బ..**

ఈ పోస్ట్ పాకిస్తాన్ కశ్మీర్ మీద మాకు హక్కు'అనే దీర్ఘకాల వాదనను స్పష్టంగా తిరస్కరించింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిన సమయంలోనే ఈ చర్య రెండు దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని ప్రపంచానికి చాటింది. పాకిస్తాన్ ఆశలు, అహంకారం ఒకేసారి కుప్పకూలాయి.

ఈ సంఘటన భారతఅమెరికా మధ్య ఆదాయంగా బలపడిన బంధాలను, పాకిస్తాన్‌పై అమెరికా పరిమిత మద్దతును స్పష్టం చేసింది. భారత భౌగోళిక సమగ్రతకు అంతర్జాతీయ ఆమోదం బలపడింది. పాకిస్తాన్ ఈ దెబ్బ నుంచి కోలుకోవడం ఇప్పట్లో కష్టమే.

# నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

- **రెడ్ హిల్స్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో చెలరేగిన మంటలు**
- **40కి పైగా కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు కాలిబూడిద**
- **నేర పరిశోధనలో కీలక ఫైళ్లకు నిప్పు**
- **ఒకరికి తీవ్ర గాయాలు**
- **విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమిక నిర్ధారణ**

**ముద్ర తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ నడిబొడ్డున నాంపల్లిలో మరోసారి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం ఉదయం రెడ్ హిల్స్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా దట్టంగా పొగలు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇద్దరు సిబ్బంది భవనంలో ఉండగా, వారిలో ఒకరు గాయపడ్డారు. క్షతగాత్రుడిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమదం జరిగిన వెంటనే రంగంలో దిగిన పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు.

**బూడిదగా మారిన భౌతిక ఆధారాలు..**

హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ కార్యాలయంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం భారీ నష్టాన్ని మిగిల్చింది. నేర పరిశోధనలో అత్యంత కీలకమైన సాక్ష్యాధారాలను భద్రపరిచే చోట మంటలు చెలరేగడంతో, పలు కేసుల్లో సేకరించిన భౌతిక ఆధారాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంపై హైదరబాద్ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీదాస్.. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడుతూ విస్తుపోయే వివరాలు వెల్లడించారు. ముఖ్యంగా డిజిటల్ సాక్ష్యాల నిధిగా భావించే సుమారు 40 నుంచి 50 కంప్యూటర్లు మంటల్లో కాలిబూడిదయినట్లు చెప్పారు. కీలకమైన డిజిటల్ డేటా శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ముందస్తు ప్రణాళికతో జరిగిన కుట్ర**
**- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

నాంపల్లిలోని రెడ్ హిల్స్‌లో ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో జరిగిన అగ్నిప్రమాదం ముందస్తు ప్రణాళికతో జరిగిన కుట్ర అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన.. అత్యంత భద్రత ఉండే ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం జరగడం అనేక అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. 2015 నాటి ఓటుకు నోటు కేసుతో సహా అనేక సున్నితమైన కేసుల ఆధారాలు ఇక్కడే ఉన్నాయనీ ఆ ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని చెప్పారు.

ముద్ర
సమగ్ర సమాచార పత్రిక
08.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
10
బిజినెస్, జనరల్ న్యూస్
Business, General news

టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు
శ్రీలంక
యువ ఆటగాళ్లతో కొత్త ఉత్సాహంతో ముందుకెళ్తోంది. స్పిన్ బౌలింగ్‌లో ఇంకా బలం ఉంది.

# కాళేశ్వరాన్ని కూలేశ్వరంగా మార్చారు

- కాళేశ్వరం డబ్బులతో ఫామ్ హౌజ్ లు కట్టుకున్నారు
- ఫోన్ టాపింగులతో భార్యాభర్తల సంభాషణ విన్నారు
- మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఏం చేశారు
- పాలమూరు రంగారెడ్డిని వదిలి రాయలసీమ నీరిస్తారంట
- కెసిఆర్ కుటుంబంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరంగా మార్చి జనాలు డబ్బులు దోచుకున్నారని ఎర్రబల్లిలో 1000 ఎకరాల్లో ఫామ్ హౌజ్ నిర్మించుకున్నారని, కేటీఆర్ జౌన్వావాడలో, హరీష్‌రావుకు మొయినాబాద్లో ఫామ్ హౌజ్లు నిర్మించుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పరిగి బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించుకున్నారని ఉద్యమకారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రాణహిత చేవెళ్లను నిలిపివేసి మెదక్ జిల్లాలోని మల్లన్న సాగర్ తదితర ప్రాజెక్టులకు నీళ్లు మళ్లించుకున్నారని గోదావరి జలాలు 3000 టీఎంసీలు సముద్రంలో కరుస్తున్నాయని అందులో నుంచి 300 టీఎంసీలు ఇచ్చిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సస్యశ్యామలమవుతుందని తాగు సాగునీరు అందుతుందని అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఒక్క రూపాయి కూడా వికారాబాద్ జిల్లాకు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. మున్సిపల్ శాఖ మంత్రిగా రంజిత్ రెడ్డి మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తామని వెల్లడించిన సిఎం రేవంత్ రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మౌలిక వసతులు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనుభవం, విజన్ ఉన్న నాయకుడిగా డాక్టర్ రంజిత్ రెడ్డిని ప్రశంసించిన సిఎం. రంజిత్ రెడ్డి లాంటి నాయకులు ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపడితే అభివృద్ధి మరింత వేగంగా చెందుతుందన్నారు.

# గోదావరి జలాలను రంగారెడ్డి తీసుకొచ్చి సస్యశ్యామలం చేస్తాం

- వికారాబాద్ జిల్లాను అంతర్జాతీయ టూరిజం చేస్తాం
- జిల్లాలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తాం
- రీజినల్ రింగు రోడ్డు, కృష్ణా రైల్వే లైను పూర్తి చేస్తాం
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి
- ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
జిల్లా అభివృద్ధికి అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం నారాయణపూర్‌లో నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి బాట" బహిరంగ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను తప్పనిసరిగా తీసుకువచ్చి వికారాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కాగ్నా నది ప్రాజెక్టు నిర్మించి తాండూర్ ప్రాంత ప్రజలకు శాశ్వత నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. జిల్లాలోని అన్ని రోడ్ల అభివృద్ధికి అవసరమైనన్ని కోట్ల రూపాయలు వెచ్చించి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు కృష్ణా రైల్వే లైన్‌ను కూడా పూర్తి చేస్తామని ప్రకటించారు. మూసీ నది ప్రక్షాళనకు ప్రభుత్వం ముందుకు వస్తే కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేశామని, నిరుద్యోగ సమస్య పరిష్కార దిశగా ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కోసం 9 వేల కోట్ల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. ఇళ్లులేని పేదలకు గృహ నిర్మాణాలు చేపట్టి వారికి ఆత్మగౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని 6,650 స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ.567.69 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సభలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, సాంకేతిక మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి. రామ్మోహన్‌రెడ్డి, బియ్యని మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాష్‌గౌడ్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా ప్రచారం



**ముద్ర, తాండూర్ :**
వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని 27వ, 36వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఆర్బిఎల్ సీఈవో శ్రీనివాస్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తాండూర్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని ప్రజలను కోరారు. 27వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి స్వరూప మల్లేశం, 36వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కల్వ సిరి చందన తరపున ప్రచారం చేస్తూ, గత రెండేళ్ల కాలంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అనేక నిధులను తీసుకువచ్చి మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ సమస్యల పరిష్కారం, తాగునీటి ఎద్దడి నివారణ, చిలుకవాగు అభివృద్ధి వంటి పలు పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే, ఇప్పటివరకు జరిగిన అభివృద్ధికి రెట్టింపు స్థాయిలో పనులు చేపడతామని, అది కాంగ్రెస్కే సాధ్యమని శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జుబేర్ లాల, ఉప్పరి మల్లేశం, చంద్రశేఖర్ గౌడ్, జగదీశ్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యెనెక్స్‌సన్‌రైజ్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగింపు

- అండర్–17 బాలికల సింగిల్స్‌లో చాంపియన్‌గా చదరం హంసిని

**ముద్ర, మల్కాజ్‌గిరి / హైదరాబాద్, క్రీడాప్రతినిధి :**




యెనెక్స్-సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్-15, అండర్-17) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2026 శనివారం ఘనంగా ముగిసింది. ఈ టోర్నీలో అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో చదరం హంసిని అద్భుత ప్రదర్శన కనబరిచి చాంపియన్‌గా నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. ఈసందర్భంగా భారత్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, మాజీ అంతర్జాతీయ కోచ్ భాస్కర్ బాబు విజేత హంసినితోపాటు ఇతర క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. "మన చిన్నారుల ప్రతిభ అభినందనీయం. క్రమశిక్షణతో పాటు కఠిన సాధన ఉంటే వారు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇలాంటి టోర్నమెంట్లు క్రీడాకారుల భవిష్యత్తుకు పునాది వంటివి," అని వారు పేర్కొన్నారు.

# తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతీరుపై మహారాష్ట్ర సీఎం ఫైర్
- గతంలో ఎలాంటి గొడవలు లేకుండా తెలంగాణకు నీళ్లు ఇచ్చాం
- ప్రాణహిత ప్రాజెక్టుపై చర్చకు మహారాష్ట్ర కు రండి
- సిర్పూర్ ఎన్నికల ప్రచారంలో దేవేంద్ర ఫడ్నవీస్




**ముద్ర, సిర్పూర్ :**
గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ విమర్శించారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ఈ రెండు ప్రభుత్వాలు కలిసి అప్పులే మిగిల్చారన్నారు. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఫడ్నవీస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన తీరును ఎండగట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు మహారాష్ట్రతో నీటి గొడవలు ఉన్నాయని చెప్పారు. 25 ఏళ్లుగా ఈ గొడవలు కొనసాగినా తెలంగాణ వచ్చాక తాము గొడవలు పెట్టుకోవాలని అనుకోలేదన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2015లో నాటి సీఎం కేసీఆర్ తన వద్దకు వచ్చి గోదావరి జలాలు మాకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. నీటి విషయంలో గొడవలు వద్దన్న నేను... కొంచెం ఎత్తు తగ్గించుకుంటే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందనీ అలాగే గడ్చిరోలి ముంపు నుంచి బయటపడుతుందని కేసీఆర్ తో చెప్పానన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎలాంటి గొడవలు లేకుండా తెలంగాణకు నీళ్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. నేడు తెలంగాణలో ఉన్న ఇరిగేషన్ పురోగతిలో తమ కృషి దాగి ఉందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ బాబు ప్రాణహిత ప్రాజెక్టు గురించి అడుగుతున్నారని ఫడ్నవీస్ గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత చర్చించేందుకు మహారాష్ట్రకు రావాలని ఎమ్మెల్యేను సీఎం ఆహ్వానించారు. మా రాష్ట్రానికి నష్టం లేకుండా పొరుగు రాష్ట్రానికి మేలు జరుగుతుంటే స్వాగతిస్తామని చెప్పారు. ఇక్కడి రైతులకు న్యాయం జరుగుతుంది అంటే దాని కోసం చర్చిద్దామన్నారు. తెలంగాణకు నీళ్లు ఇచ్చేందుకు మాకు సంతోషమేనన్నారు. మేడిగడ్డతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం ఇస్తామని చెప్పి బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని ఆరోపించారు.తాము నీళ్లు ఇచ్చినా నియత్ నిలుపుకోలేదని దుయ్యబట్టారు. ఈ రెండు పార్టీలు తొడుదొంగలని మహారాష్ట్ర రైతులకు తాను సర్ది చెప్పానని ఆ తర్వాత తమ ప్రభుత్వమే వారికి నష్ట పరిహారం అందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాబోయే రోజుల్లో బెల్లంపల్లి నుంచి గడ్చిరోలి హైవే నిర్మాణం చేపడతామన్నారు. మహారాష్ట్రలో ఇటీవలే మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిందన్న ఫడ్నవిస్... తెలంగాణ మహారాష్ట్రకు పొరుగునే ఉందని మహారాష్ట్ర గాలి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లోనూ వీయబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు.

# రూ. 85 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- 7వేల గజాల పార్కులకు హైడ్రా ఫెన్సింగ్

**ముద్ర, హైదరాబాద్ :**



వాటిని కొలతల్లో లెక్కలు కడితే 7వేల గజాలు. డబ్బుల్లో విలువను పరిశీలిస్తే రూ. 85కోట్లు. ప్రాణ వాయువును అందించే పార్కులుగా లెక్కలు కడితే ఆ విలువ అనంతం. అందుకే పార్కుల పరిరక్షణకు హైడ్రా ప్రాధాన్యం ఇస్తుంది. ఈ క్రమంలోనే మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో 7వేల గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాలను హైడ్రా శనివారం కాపాడింది. వ్యవస్థలను మేనేజ్‌చేసుకుంటూ కబ్జాలకు పాల్పడిన వారి ఆటలకు అడ్డుకట్ట వేసింది. 1980లో 183ప్లాట్లతో బాబానగర్ కాలనీ లే ఔట్‌ను వేశారు. ఇందులో 3వేల గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. 1999వ సంవత్సరం వరకూ ఇది పార్కుగానే కొనసాగింది. కాప్రా సర్కిల్ వారు ఈమేరకు హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. కాని తర్వాత ఆ లే ఔట్‌లో 183 ఉన్న ప్లాట్ల సంఖ్య 189కి పెరిగిపోయింది. మొత్తం 3 వేల గజాలను 500ల గజాల చొప్పున 6 ప్లాట్లుగా మార్చేశారు. ఇలా పార్కునే ప్లాట్లుగా చేసి అమ్మిన ప్లాట్లలో 188వ ప్లాట్ కొన్న బొట్ల సాయి తర్వాత కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడయ్యాడు. 500ల గజాల ప్లాట్‌లో 266గజాల మేర బొట్ల సాయి ఇల్లు కట్టుకున్నాడు. మిగిలిన 234గజాల స్థలాన్ని ఖాళీగా ఉంచాడు. 188 ప్లాట్‌కు పక్కన ఉన్న రహదారి స్థలాన్ని కూడా కబ్జా చేస్తూ బై నంబర్లు వేసి బొట్ల సాయి 50గజాల చొప్పున మరో 6ప్లాట్లు చేసి అమ్మాడంటూ మొత్తం ఉదంతంపై అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 3వేల గజాల పార్కును కాపాడాలంటూ విజ్ఞప్తి చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ గారి ఆదేశాల మేరకు జీహెచ్ ఎంసీ, రెవెన్యూ అధికారులతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 3వేల గజాలు పార్కుకు కేటాయించినట్టు నిర్ధారించుకున్నారు. ఇప్పటికే కొన్ని నివాసాలు రాగా.. మిగిలిన 2వేల గజాల స్థలాన్ని పరిరక్షిస్తూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అలాగే ఉప్పల్ మండలం నాచారం గ్రామంలోని కార్తికేయ నగర్‌లో కూడా 3 ఓపెన్ ప్లేస్‌లతో పాటు.. పార్కులకు కేటాయించిన 5వేల గజాలను హైడ్రా శనివారం కాపాడింది.

# కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

**తాండూర్, ముద్ర :**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూర్‌లో నిర్వహించనున్న రోడ్‌షోలో పాల్గొననున్నారని, తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం తన నివాసంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఆదివారం ఉదయం 9గంటలకు తాండూర్‌లోని ఇందిరా చౌక్ వద్ద కేటీఆర్ రోడ్‌షో ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ రోడ్‌షో ద్వారా ప్రతిపక్ష పార్టీలకు గట్టి సమాధానం ఇవ్వాలని, ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రోడ్‌షో సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా కార్యక్రమం సజావుగా సాగేలా పార్టీ ఇన్‌చార్జీలు, శ్రేణులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజు గౌడ్, బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నరసింహులు, నరేందర్ గౌడ్, శ్రీనివాస్ చారి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'ప్రజాబాట'

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు. శనివారం వికారాబాద్ మండలం జైదుపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యుత్ అధికారులు గ్రామానికి వెళ్లి నేరుగా వినియోగదారుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాబాట కార్యక్రమం చేపట్టినట్లు సీఈ బాలస్వామి తెలిపారు. గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలతో కలిసి గ్రామంలో పర్యటిస్తూ లో ఓల్టేజ్, లూజ్ లైన్ల వంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్న సమస్యలను అక్కడికక్కడే విద్యుత్ సిబ్బందితో పరిష్కరించగా, పెద్ద సమస్యలను నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌనిక శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ సంజీవ్, ఏడీఈ సత్యనారాయణ రెడ్డి, ఏఈ వేణుగోపాల్ రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్లోళ్ల అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా ప్రచారం

**ముద్ర, తాండూర్ :**
వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని 9వ, 10వ వార్డుల పరిధిలోని సాయిపూర్ ప్రాంతంలో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే సతీమణి ఆర్తి రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాయిపూర్ ప్రాంతం అంటేనే పట్లోళ్ల కుటుంబానికి కంచుకోటగా తాండూర్ నియోజకవర్గ ప్రజలు భావిస్తారని తెలిపారు. ప్రత్యర్థి ఎవరు ఉన్నా పట్లోళ్ల కుటుంబాన్ని ఓడించడం అసాధ్యమన్నారు. పార్టీలకు అతీతంగా ఏ సమస్య వచ్చినా ప్రజలకు అండగా నిలిచే కుటుంబమి దేనని అన్నారు. రోహిత్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనంగా సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి సదుపాయాలను సూచిస్తూ, బీఆర్ఎస్ పాలన ఎలా ఉంటుందో ఇవే చెబుతున్నాయని ఆర్తి రెడ్డి అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పట్లోళ్ల దీప, 10వ వార్డు చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నరసింహులు, సీనియర్ నాయకులు శ్యామ్ రెడ్డి, గంగాధర్, యూసుఫ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం

**తాండూర్, ముద్ర :**
కాంగ్రెస్ పాలనలోనే 8వ వార్డులో గృహ నిర్మాణాలు జరిగాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణానికి సమీపంలోని రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని, గత పాలకులు ఈ వార్డును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తాండూర్ మున్సిపల్ పరిధిలో అత్యధిక ఓటర్లు ఉన్న 8వ వార్డు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి తలారి సాయప్పను గెలిపించాలని కోరారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈ వార్డు రూపురేఖలు మార్చుతామని, కాలనీలో శాంతిభద్రతలు మెరుగుపడేలా ఈ వార్డును తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థి తలారి సాయప్ప, మాజీ కౌన్సిలర్ వెంకన్న గౌడ్, పార్టీ నాయకులు అబ్దుల్ రహూఫ్, ముజీబ్, జిలాని, నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

**టీ20 వరల్డ్ కప్‌లో టాప్ 10 జట్లు**

**అఫ్ఘానిస్తాన్**
స్పిన్ దాడితో పెద్ద జట్లను కూడా ఓడించగలదు. ఇటీవలి కాలంలో వేగంగా ఎదుగుతున్న జట్టు.



# రొమారియో హ్యాట్రిక్..

## స్కాట్లాండ్‌పై విండీస్ ఘన విజయం !



**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్ స్కాట్లాండ్‌పై 35 పరుగుల తేడాతో విజయం, రొమారియో షెపర్డ్ హ్యాట్రిక్‌తో చరిత్ర సృష్టించాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 గ్రూప్‌సి మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు అద్భుత ప్రదర్శనతో టోర్నీని ఘనంగా ఆరంభించింది. స్కాట్లాండ్‌పై 35 పరుగుల తేడాతో గెలుపొంది శుభారంభం చేసింది. ఈ మ్యాచ్‌లో విండీస్ పేసర్ రొమారియో షెపర్డ్ బౌలింగ్‌లో విధ్వంసం సృష్టించాడు. 17వ ఓవర్‌లో మ్యాథ్యూ క్రాస్, మైఖేల్ లీస్క్, ఆలివర్ డేవిడ్సన్‌లను వరుస బంతుల్లో ఔట్ చేసి సంచలన హ్యాట్రిక్ నమోదు చేశాడు. అదే ఓవర్ చివరి బంతికి సఫ్యాన్ షరీఫ్‌ను కూడా పెవిలియన్ చేర్చి, టీ20 ప్రపంచకప్ చరిత్రలో వెస్టిండీస్ తరఫున హ్యాట్రిక్ తీసిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. కేవలం 3 ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టి స్కాట్లాండ్ పతనాన్ని శాసించాడు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న స్కాట్లాండ్ ముందు విండీస్ 182 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచగా, ఛేదనలో ఆ జట్టు 147 పరుగులకే కుప్పకూలింది.మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. షిమ్రాన్ హెట్‌మయర్ 36 బంతుల్లోనే 64 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. బ్రాండన్ కింగ్ (35), షెర్ఫేన్ రదర్‌ఫర్డ్ (26), కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (24) తమ వంతు సహకారం అందించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ కుర్రీ రెండు వికెట్లు తీసి పర్వాలేదనిపించాడు. చివరి నిమిషంలో బంగ్లాదేశ్ స్థానంలో టోర్నమెంట్‌కు అర్హత సాధించిన స్కాట్లాండ్ బౌలింగ్‌లో పట్టు సాధించలేకపోయింది.

లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ ఆరంభంలో ధాటిగా ఆడినా, కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయి 17 ఓవర్ల లోనే 147 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ రిచీ బెరింగ్టన్ 24 బంతుల్లో 42 పరుగులు, మాథ్యూ క్రాస్ 35, జార్జ్ మన్సీ 19 పరుగులతో పోరాడినా ఫలితం లేకపోయింది. జాసన్ హోల్డర్, గుడాకేష్ మోటీ, షమర్ జోసెఫ్ తలో చేయి వేసి వికెట్లు తీయగా, షెపర్డ్ డెత్ ఓవర్లలో విజృంభించి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. ఈ విజయంతో వెస్టిండీస్ నెట్ రన్ రేట్ మెరుగుపరుచుకుని పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానంలో నిలిచింది.

# అదిరిపోయిన టీ20 వరల్డ్ కప్ ఓపెనింగ్ సెర్మనీ..

**సందడి చేసిన తారలు**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

ముంబైలోని ప్రసిద్ధ వాంఖడే స్టేడియం వేదికగా ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రం ఆతిథ్య భారత్, అమెరికా జట్ల మధ్య తొలి మ్యాచ్‌కు ముందు నిర్వహించిన ప్రారంభ వేడుకలు కనువిందు చేశాయి.

అదిరిపోయిన ప్రదర్శనలు ప్రముఖ సంగీత విద్వాంసుడు రిషబ్ శర్మ తన మ్యూజిక్‌తో అలరించగా, పెర్కషన్ మాస్ట్రో శివమణి డ్రమ్స్ వాయిద్యంతో స్టేడియంలో ఉత్సాహాన్ని నింపారు. ఆ తర్వాత గాయకుడు బాద్షా, డ్యాన్సర్ నోరా ఫతేహి తమ పెర్ఫార్మెన్స్‌లతో అభిమానులను ఉర్రూతలూగించారు.

**జెట్‌ప్యాక్‌తో ఎంట్రీ ఇచ్చిన ట్రోఫీ**

ఈ వేడుకలో అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే.. ప్రపంచకప్ ట్రోఫీ ఎంట్రీ! ఒక ప్రదర్శకుడు జెట్‌ప్యాక్ సాయంతో గాలిలో ఎగురుతూ వచ్చి ట్రోఫీని స్టేడియంలోకి తీసుకువచ్చారు. ఈ వినూత్న ప్రవేశం ప్రేక్షకులను కట్టిపడేసింది.





**అధికారికంగా ప్రారంభించిన జై షా, రోహిత్ శర్మ**

ఐసీసీ చైర్మన్ జై షా మరియు 2024 ప్రపంచకప్ విజేత కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మెగా టోర్నీని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టోర్నీలో పాల్గొంటున్న 20 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న చిన్నారులు కూడా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వేడుక ముగింపులో బాద్షా, నోరా ఫతేహి కలిసి చేసిన ప్రదర్శనతో పాటు ఆకాశంలో బాణసంచా మెరుపులు వాంఖడేను దేదీప్యమానం చేశాయి.



# అండర్–19 ప్రపంచ కప్ విజేతలకు బీసీసీఐ భారీ నగదు ప్రోత్సాహకం

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :**

అండర్-19 ప్రపంచ కప్ 2026ను సొంతం చేసుకున్న భారత యువ జట్టుకు బీసీసీఐ రూ.7.50 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. ఈ విషయాన్ని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. శుక్రవారం జరిగిన ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి భారత్ ట్రోఫీని ముద్దాడింది. ఈ కీలక మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 175 పరుగులతో అదరగొట్టి జట్టు విజయానికి ప్రధాన కారణంగా నిలిచాడు.

టోర్నీ మొత్తం ఒక్క పరాజయం లేకుండా విజేతగా నిలవడం యువ జట్టు ప్రతిభకు నిదర్శనమని బీసీసీఐ పేర్కొంది. ఈ విజయం దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపిందని దేవజిత్ సైకియా తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ కూడా యువ భారత జట్టును అభినందించారు. అండర్-19 జట్టు విజయం భారత క్రికెట్ భవిష్యత్తుకు మంచి సంకేతమని పేర్కొంటూ, ఆటగాళ్ల ప్రదర్శన ఎంతోమందికి ప్రేరణగా నిలిచిందని ఆయన ప్రశంసించారు.



# గాయాల షాక్‌తో ప్రపంచ కప్‌కు భారత్,

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :**

పొట్టి ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిస్తున్న భారత్‌తో పాటు సహ ఆతిథ్య దేశం శ్రీలంకకు టోర్నీ ఆరంభానికి ముందే గాయాల రూపంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. టైటిల్‌పై కన్నేసిన ఇరు జట్లు కీలక పేసర్లను అనూహ్యంగా కోల్పోయాయి. లీగ్ దశ తొలి మ్యాచ్‌కు ముందే భారత ఆల్‌రౌండర్ హర్షిత్ రానా, శ్రీలంక యార్కర్ స్పెషలిస్ట్ ఇషాన్ మలింగ గాయాలతో టోర్నీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో హర్షిత్‌పై ఆశలు పెట్టుకున్న భారత్‌కూ, మలింగను ప్రధాన ఆయుధంగా భావించిన లంకకూ పెద్ద షాక్ ఎదురైంది.

దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ అనంతరం మోకాలి గాయం పాలైన హర్షిత్ రానా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడి స్థానంలో మహమ్మద్ సిరాజ్‌ను సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. మరోవైపు ఇంగ్లండ్‌తో సన్నాహక మ్యాచ్‌లో ఎడమ భుజానికి గాయపడిన ఇషాన్ మలింగ టోర్నీకి దూరమయ్యాడు. అతడి స్థానంలో ప్రమోద్ మధుషాన్‌కు అవకాశం లభించింది. పరిమిత అంతర్జాతీయ అనుభవం ఉన్నప్పటికీ, పథిరన, చమీరలతో కలిసి లంక పేస్ దళంలో మధుషాన్ కీలక పాత్ర పోషించనున్నాడు. శ్రీలంక తమ తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 8న ఐర్లాండ్‌తో తలపడనుంది.

**శ్రీలంక టీ20 ప్రపంచ కప్ జట్టు:**
దసున్ శనక (కెప్టెన్), పథుమ్ నిశాంక, కమిల్ మిశార, కుశాల్ మెండిస్, కమిందు మెండిస్, కుశాల్ జనిత్ పెరీరా, చరిత అసలంక, జనిత్ లియానగే, పవన్ రత్ననాయకే, వనిందు హసరంగ, దునిత్ వెల్లలాగే, మహీశ్ థీక్షణ, దుశ్మంత చమీర, మథీశ పథిరన, ప్రమోద్ మధుషాన్.

**భారత టీ20 ప్రపంచ కప్ జట్టు:**
అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, శివం దూబే, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, మహమ్మద్ సిరాజ్.





# నెదర్లాండ్స్ పోరాటం... అతికష్టం మీద పాక్ విజయం

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :**

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా శనివారం జరిగిన నెదర్లాండ్స్-పాకిస్తాన్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. టోర్నీలో ఇరు జట్లకు ఇదే తొలి పోరాటం కాగా, నెదర్లాండ్స్ నిర్దేశించిన స్వల్ప లక్ష్యాన్ని పాకిస్తాన్ చివరి ఓవర్లలోనే ఛేధించి గెలుపు అందుకుంది. టాస్ గెలిచిన పాకిస్తాన్ బౌలింగ్ ఎంచుకోగా, నెదర్లాండ్స్ 19.5 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. స్కాట్ ఎడ్వర్డ్స్ 37 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, బాస్ డీ లీడే (30), మేఖేల్ లెవిట్ (24), అకెర్మాన్ (20) రాణించారు. పాకిస్తాన్ బౌలింగ్‌లో సల్మాన్ మీర్జా మూడు వికెట్లు పడగొట్టాడు.

148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ ఓ దశలో ఒత్తిడిలో పడింది. ఓపెనర్ ఫర్హాన్ 47 పరుగులు చేసి పోరాటానికి నాంది పలకగా, ఆయుబ్ 24 పరుగులు జత చేశాడు. అయితే మిడిల్ ఆర్డర్ విఫలమవడంతో మ్యాచ్ నెదర్లాండ్స్ వైపుకు మళ్లినట్టే కనిపించింది. కీలకమైన 19వ ఓవర్‌లో లోగాన్ వాన్ బీక్ ఇచ్చిన పరుగులు పాక్‌కు ఊపిరిపోశాయి. చివర్లో ఫాహీమ్ అష్రఫ్ 11 బంతుల్లో 29 పరుగులతో చెలరేగడంతో పాకిస్తాన్ 19.3 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఓటమి ఎదురైనా, పటిష్ట జట్టైన పాక్‌కు గట్టి పోటీ ఇచ్చిన నెదర్లాండ్స్ పోరాటం ప్రేక్షకులను ఆకట్టుకుంది.



# సిద్ధివినాయకుడి ఆశీస్సులతో టీమిండియా ప్రపంచ కప్ ప్రయాణం

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026లో మరోసారి కిరీటం నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్న భారత జట్టు, తొలి మ్యాచ్‌కు ముందు దైవ ఆశీస్సులు కోరుకుంది. శనివారం అమెరికాతో జరిగే ప్రారంభ మ్యాచ్‌ను దృష్టిలో ఉంచుకుని, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సహా కొందరు సహాయక సిబ్బంది ముంబైలోని ప్రసిద్ధ శ్రీ సిద్ధివినాయక గణపతి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముఖ్యమైన టోర్నీల ముందు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం కోసం ఆలయ దర్శనానికి వెళ్లినట్లు జట్టు వర్గాలు తెలిపాయి. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ఉన్న భారత జట్టు, ఈ ప్రార్థనలు తమ ప్రయాణానికి శుభసూచకంగా మారుతాయని ఆశిస్తోంది. అమెరికాపై గెలుపుతో టోర్నీకి శుభారంభం చేయాలనే పట్టుదలతో ఉన్న టీమిండియా ఆటగాళ్ల ఆలయ సందర్శనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# బీసీసీఐ కాంట్రాక్టుల్లో కీలక మార్పులు..

# రోహిత్, కోహ్లీ గ్రేడ్ డౌన్?



**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

2025-26 సీజన్‌కు సంబంధించిన భారత క్రికెట్ జట్టు వార్షిక కాంట్రాక్టుల జాబితాలో బీసీసీఐ కీలక మార్పులు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆంగ్ల మీడియా కథనాల ప్రకారం, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటివరకు ఉన్న ఏ+ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్‌కు మార్చినట్టు సమాచారం. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా బీ కేటగిరీలోనే కొనసాగనున్నాడు. ఇక ఏ గ్రేడ్‌లో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా చోటు దక్కించుకున్నారని తెలుస్తోంది.

రోహిత్, కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్లకు వీడ్కోలు పలకగా, ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. ఇదే కాంట్రాక్టుల్లో మార్పులకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఇప్పటివరకు ఏ+ గ్రేడ్‌లో ఉన్న ఆటగాళ్లు ఏడాదికి రూ.7 కోట్ల వేతనం అందుకోగా, ఏ గ్రేడ్‌కు రూ.5 కోట్లు, బీ గ్రేడ్‌కు రూ.3 కోట్లు, సీ గ్రేడ్‌కు రూ.1 కోటి చెల్లించేవారు. తాజా సమాచారం ప్రకారం ఏ+ కేటగిరీని పూర్తిగా తొలగించే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొత్త విధానంలో వేతన నిర్మాణం ఎలా ఉంటుందన్నది ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.

**సంభావ్య కాంట్రాక్ట్ జాబితా (2025–26):**

**గ్రేడ్ ఏ:**
శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా

**గ్రేడ్ బి:**
రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, మహ్మద్ సిరాజ్, రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్

**గ్రేడ్ సి:**
అక్షర్ పటేల్, తిలక్ వర్మ, రింకు సింగ్, శివమ్ దూబే, ధ్రువ్ జురేల్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, నితీశ్ కుమార్ రెడ్డి, అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్, రవి బిష్ణోయ్, రుతురాజ్ గైక్వాడ్

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
08.02.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## మైథలాజికల్ సినిమాలో రామ్ చరణ్...

### చిరంజీవి కోరిక మేరకే ఆ పాత్ర చేయబోతున్నాడా..?

మెగాస్టార్ చిరంజీవి గురించి మనం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. తెలుగు తెరమీద చెరగని ముద్ర వేసిన నటుడుగా తనకంటూ ఒక ఐడెంటిటిని సంపాదించుకున్నాడు. సీనియర్ ఎన్టీఆర్ తర్వాత ఆ రేంజ్ స్టార్ డమ్ ను సంపాదించుకున్న నటుడు కూడా చిరంజీవే కావడం విశేషం... ఇక ప్రస్తుతం ఆయన 70 సంవత్సరాల వయసులో కూడా హీరోగా రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నాడు. రీసెంట్ గా 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో 400 కోట్లకు పైన కలెక్షన్స్ ను కొల్లగొట్టాడు. ఇక తన నట వారసుడు అయిన రామ్ చరణ్ సైతం గ్లోబల్ స్టార్ గా అవతరించడమే కాకుండా పాన్ ఇండియాలో డిఫరెంట్ సినిమాలను చేయడానికి ఆసక్తి చూపిస్తుండటం విశేషం...

ఇక రామ్ చరణ్ ఇప్పటివరకు చేసిన సినిమాలు అతన్ని టాప్ లెవెల్ కి తీసుకెళ్ళాయి. చిరంజీవి ఇప్పటివరకు మైథాలాజికల్ సినిమాల్లో ఎక్కువగా నటించలేదు.ఒకటి రెండు క్యారెక్టర్లు పోషించినప్పటికి ఫుల్ లెంత్ క్యారెక్టర్లలో తను పెద్దగా నటించలేదు. కొన్ని పాత్రల్లో నటించిన కూడా అవి అతనికి గొప్ప గుర్తింపునైతే తీసుకురాలేదు. దాంతో రామ్ చరణ్ రాముడిగా నటిస్తే చూడాలని చిరంజీవి ఎప్పటినుంచో అనుకుంటున్నారట. 'త్రిబుల్ ఆర్' సినిమాలో రామ్ చరణ్ అల్లూరి సీతారామరాజు గా కనిపించాడు. చివర్లో కొద్దిసేపు ప్రతి ఒక్కరు రాముడి అవతారంలో కనిపించాడు అంటూ కామెంట్లైతే చేశారు. ఇక ఏది ఏమైనా కూడా ఫుల్ లెంత్ రాముడి పాత్రలో రామ్ చరణ్ ని చూడాలని చిరంజీవి అనుకుంటున్నారట. దానికి తగ్గట్టుగానే కొంతమంది దర్శకులు అతనితో రామాయణాన్ని తీయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మరి రామ్ చరణ్ సైతం రామాయణంలో నటించడానికి సిద్ధమవుతున్నాడట. ఇక బాలీవుడ్ లో ఇప్పటికే రన్బీర్ కపూర్ రాముడిగా రామాయణం సినిమా తెరకెక్కుతుంది. భారీ బడ్జెట్ సినిమా ఈ రేంజ్ రికార్డులను క్రియేట్ చేస్తుంది అంటూ ఇండియన్ సినిమా ప్రేక్షకులంతా వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే రామ్ చరణ్ సైతం రామాయణం సినిమా చేస్తే ఆ సినిమా ఎలాంటి క్రేజ్ ను సంపాదించుకుంటుంది ప్రేక్షకుల్లో అటెన్షన్ క్రియేట్ అవుతుందా? లేదా అనేది తెలియాల్సి ఉంది...



## అభిషేక సేవలో మీనాక్షి

సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి కాలినడకమార్గంలో గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శుక్రవారం వేకువజామున ఆలయంలో జరిగిన అభిషేక సేవలో పాల్గొని మూలవిరాట్టును దర్శించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో మీనాక్షిని చూసేందుకు యాత్రికులు ఆసక్తి చూపారు.

MEENAKSHI



## గుర్తింపు కోసం ఆరాటం

తెలుగు చిత్ర పరిశ్రమలో అందం, అభినయం ఉన్నా ప్రతి నటీమణికి స్టార్‌డమ్ దక్కడం లేదు. ఈ జాబితాలో యంగ్ బ్యూటీ కాయదు లోహర్ కూడా ఉంది. శ్రీ విష్ణుతో చేసిన ‘అల్లురి’ సినిమాతో గుర్తింపు వచ్చినప్పటికీ, ఆ సినిమా ఫలితం ఆమె కెరీర్‌కు ఆశించిన ఊపు ఇవ్వలేదు.ప్రస్తుతం కాయదు లోహర్ “ఫంకీ” సినిమాపై ఆశలు పెట్టుకుంది. ఫిబ్రవరి 13న విడుదలకానున్న ఈ చిత్రంతో తెలుగులో క్రేజీ హీరోయిన్‌గా ఎదగాలని ఆమె భావిస్తోంది. ఈ సినిమా విజయం ఆమె టాలీవుడ్ భవిష్యత్తును నిర్ణయించనుందని సినీ వర్గాలు అంటున్నాయి.



## వారంలో 6 కథలను విన్న బాలయ్య...

**స్టార్ డైరెక్టర్లందరు క్యూ కట్టేశారా?**

తెలుగు సినిమా ఇండస్ట్రీలో బాలయ్య బాబుకి చాలా మంచి క్రేజ్ అయితే ఉంది. సీనియర్ హీరోగా మంచి గుర్తింపును సంపాదించుకున్న ఆయన వరుస సక్సెస్ లను సాధిస్తూ ముందుకు సాగుతున్నాడు. రీసెంట్ గా వచ్చిన 'అఖండ 2' నిరాశ పరిచినప్పటికి అంతకుముందు చేసిన అఖండ, భగవంత్ కేసరి, వీర సింహారెడ్డి, డాకు మహారాజ్ లాంటి వరుసగా నాలుగు సినిమాలతో సక్సెస్ లను సాధించాడు... ఇక ప్రస్తుతం స్టార్ డైరెక్టర్లందరు బాలయ్య బాబు వైపే ముగ్గు చూపిస్తున్నారు. ఎన్టీఆర్ తో దేవర సినిమా చేసి సక్సెస్ ని అందుకున్న కొరటాల శివ అప్పటినుంచి ఇప్పటివరకు కాళీగానే ఉన్నాడు. దాదాపు సినిమా రిలీజై సంవత్సరం న్నర అవుతున్నప్పటికి తను నెక్స్ట్ సినిమాని స్టార్ట్ చేయలేకపోతున్నాడు. దేవర 2 సినిమా ఉంటుందని అనుకున్నప్పటికి అది ఇప్పుడప్పుడే పట్టాలెక్కే అవకాశాలు లేనట్టుగా తెలుస్తున్నాయి. దాంతో



కొరటాల శివ సైతం బాలయ్య బాబుతో సినిమా చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. ఇప్పటికే బాలయ్య బాబుని కలిసి ఒక కథను కూడా వినిపించారట. బాలయ్య బాబు ఆ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలుస్తుంది. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా చేస్తున్న బాలయ్య ఈ సినిమా తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో సినిమా చేసే అవకాశమైతే ఉంది. ఇక కొరటాల శివ తో పాటు హరీష్ శంకర్ సైతం బాలయ్యకు ఒక కథనైతే వినిపించాడు. ఇక అనిల్ రావిపూడి సైతం ఒక డిఫరెంట్ కథను బాలయ్య బాబుకి చెప్పారట... వివేక్ ఆత్రేయ సైతం బాలయ్యకి ఒక కథనైతే చెప్పాడు. అది ఫుల్ మాస్ కథగా తెలుస్తోంది...కన్నడ సినిమా ఇండస్ట్రీలో మార్కో సినిమాతో మంచి గుర్తింపును సంపాదించుకున్న 'అనీఫ్ ఆదోని' సైతం బాలయ్య బాబుకి ఒక కథనైతే చెప్పాడు... ఇక రజనీకాంత్ తో 'జైలర్' సినిమా తీసి సూపర్ సక్సెస్ ని సాధించిన నెల్సన్ సైతం బాలయ్య కి ఒక లైన్ అయితే చెప్పారట. మొత్తానికైతే ఈ వారం రోజుల్లో బాలయ్య ఒక ఆరు కథలను విన్నాడు. తనకు జతలు చెప్పిన దర్శకులందరు కూడా స్టార్ డైరెక్టర్లే కావడం విశేషం... ఇక ఇప్పుడు బాలయ్య ముందు కొరటాలతో చేస్తాడా ఇంకా వేరే డైరెక్టర్ తో తను సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడా అనేది తెలియాల్సి ఉంది...




## మరో సందీప్ రెడ్డి వచ్చేశాడు ట్రైలర్ తో అరాచకం

‘అర్జున్ రెడ్డి’తో సంచలనం సృష్టించిన సందీప్ రెడ్డి వంగా స్టైల్‌ను గుర్తు చేస్తూ ‘నిలవే’ మూవీ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లోని కట్స్, ఎడిటింగ్, మ్యూజిక్‌కు నెటిజన్లు ఫిదా అవుతుండగా, దర్శకుడిని ప్రశంసిస్తూ “మరో సందీప్ రెడ్డి వచ్చేశాడు” అంటూ కామెంట్లు చేస్తున్నారు. హీరోయిన్ శ్రేయాసి సేన్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అభిప్రాయపడుతున్నారు.సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కె. వెన్నంతో కలిసి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రేయాసి సేన్ కథానాయికగా నటించిన ‘నిలవే’ చిత్రం ఫిబ్రవరి 13న ప్రేమికుల రోజు కానుకగా విడుదల కానుంది. ట్రైలర్‌కు వచ్చిన స్పందనతో ఈ సినిమా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## పవన్ కళ్యాణ్ కొత్త సినిమాలో పాకిస్థాన్ హీరోయిన్?

పవన్ కళ్యాణ్ గతం లో ఒప్పుకున్న మూడు సినిమాల షూటింగ్స్ పూర్తి అయ్యాక, ఆయన తన సమయాన్ని మొత్తం పాలన పైనే వెచ్చించాడు. మళ్లీ సినిమాల్లో నటిస్తాడా లేదా అనే అనుమానం అందరిలో ఉండేది. ఎందుకంటే ఆయన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ ని యాక్టీవ్ చేసాడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ తో కలిసి వరుసగా నాలుగు సినిమాలు నిర్మించడానికి రెడీ అయ్యాడు. పవన్ కళ్యాణ్ మూవ్మెంట్స్ ని చూసి ఇక మీదట ఆయన నిర్మాతగా మాత్రమే కొనసాగుతాడు, నటించడం అనుమానమే అని అనుకున్నారు. కానీ కొత్త సంవత్సరంలో సురేందర్ రెడ్డి తో పవన్ కళ్యాణ్ తదుపరి చిత్రం ఉంటుందని అధికారిక ప్రకటన చేశారు. జనసేన పార్టీ కి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న రామ్ తాళ్ళూరి ఈ చిత్రానికి నిర్మాత. ఉగాది రోజున ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరగబోతున్నాయి. ఇదంతా పక్కన పెడితే ఈ సినిమాలో హీరోయిన్ క్యారక్టర్ పై సోషల్ మీడియా లో



ప్రచారం అవుతున్న ఒక వార్త ఇప్పుడు ఇండస్ట్రీ లో హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం ప్రభాస్ , హను రాఘవపూడి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'ఫౌజీ' లో హీరోయిన్ క్యారెక్టర్ చేస్తున్న ఇమాన్విని, పవన్ కళ్యాణ్, సురేందర్ రెడ్డి కాంబినేషన్ మూవీ లో హీరోయిన్ గా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఇమాన్వి పాకిస్తాన్ దేశానికి చెందిన అమ్మాయి అనేది అందరికీ తెలిసిన విషయమే. 'ఆపరేషన్ సింధూర్' సమయం లో ఒక పాకిస్థాన్ హీరోయిన్ తో సినిమా ఎలా చేస్తారు?, వెంటనే ఆమెని ఈ చిత్రం నుండి తొలగించండి అంటూ పెద్ద ఎత్తున నెటిజెన్స్ డిమాండ్ చేశారు. ఈ ప్రచారం బాగా వైరల్ అవ్వడం తో ఇమాన్వి అప్పట్లో రెస్పాన్స్ ఇస్తూ 'నేను పాకిస్థానీ అమ్మాయిని కాదు, ఇండియన్ ని, ప్రస్తుతం అమెరికా లో ఉంటున్నాను' అంటూ క్లారిటీ ఇచ్చింది. కానీ నెటిజెన్స్ ఆమె మాటలను నమ్మలేదు. గతంలో ఆమె వేసిన కొన్ని పోస్టులను చూపిస్తూ, నువ్వు పాకిస్తానీ అమ్మాయి వే అంటూ కామెంట్స్ చేశారు. అయితే పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆ అమ్మాయి తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం వల్ల కాంట్రవర్సీ క్రియేట్ అవుతుందా?. ఎందుకంటే పవన్ కళ్యాణ్ ఒక రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రి, NDA లో నేషనల్ లెవెల్ లీడర్. అలాంటి నాయకుడు శత్రు దేశానికి సంబంధించిన హీరోయిన్ తో కలిసి నటిస్తే, కచ్చితంగా విమర్శలు ఎదురుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ఇమాన్వి ని హీరోయిన్ గా ఎంచుకున్నారు అనేది గాసిప్ మాత్రమే, ఒకవేళ అధికారికంగా ఖరారు అయితే మాత్రం విమర్శలు ఎదురుకోవాల్సిందే. కానీ ఇది ఖరారు అయితే ఇమాన్విది మాత్రం మామూలు లక్ కాదనే చెప్పాలి. ఎందుకంటే కెరీర్ ప్రారంభంలో మొదటి రెండు సినిమాలు ప్రభాస్, పవన్ కళ్యాణ్ లాంటి బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ తో చేసే అదృష్టం ఎంతమందికి ఉంటుంది చెప్పండి అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com